# జనశక్తి

**విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక**

సంపుటి : 44 సంచిక : 7 విజయవాడ 5-8-2011 పేజీలు : 8 వెల: రు 5.00

www.janashaktionline.com


**లోపలి పేజీల్లో...**


- అమెరికా : రుణపరిమితిపై చర్చ– శ్రామిక ప్రజలపై దాడికి కప్పిన తెర
- సామ్రాజ్యవాదుల అవసరాలకోసం మన దేశంలో పెద్దఎత్తున యురేనియం వెలికితీత
- మత్స్యకారుల సమస్యలను తీవ్రంచేస్తున్న పాలకుల విధానాలు
- బాలకార్మికుల శ్రమతో వర్థిల్లుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం


# దుర్భిక్ష ప్రాంతాలలో సహాయక చర్యల అమలు

# పాలకుల ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యం

**గత** సంవత్సరం అతివృష్టితో లక్షలాది ఎకరాల్లో రైతులు పంటలను కోల్పోతే, ఈ సంవత్సరం అనావృష్టి పంటలను కబళిస్తున్నది. ఈ పరిస్థితి మన వ్యవసాయం నేటికీ వర్షాధారంగానే ఉందని చెప్పకనే చెబుతున్నది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన మన దేశంలో మూడింట రెండువంతుల సాగు వర్షాలపైనే ఆధారపడి ఉంది. ఫలితంగా అతివృష్టి–అనావృష్టి వలన రైతాంగం నిలువునా నష్టపోతున్నారు.

రాష్ట్రంలో కోటీ 95 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సేద్యం జరుగుతోంది. ఈ సంవత్సరం ఇప్పటివరకు అనావృష్టి పరిస్థితులవలన 81.27 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారు. రాష్ట్రంలో జూలై 20 వరకు 221.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి వుండగా 181.4 మి.మీటర్లు మాత్రమే నమోదు అయ్యింది. కర్నూలు, అనంతపురం, కడప, మహబూబ్‌నగర్ జిల్లాలలో 40 నుండి 48 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదు అయ్యింది. మిగతా జిల్లాల్లో 20 నుండి 27 శాతం వరకు తక్కువగా వర్షాలు పడ్డాయి. వర్షాల లేమి వలన రాయలసీమలో 10 లక్షల ఎకరాల్లో వేరుశనగ వేయాల్సి ఉండగా 8 లక్షల ఎకరాల్లోనే వేశారు. వేసిన తర్వాత వర్షాలు లేని రోజులే ఎక్కువగా ఉండటం వలన నీటి ఎద్దడికి గురై పంటలు దెబ్బతింటున్నాయి. పప్పుధాన్యాలు 21 లక్షల ఎకరాల్లో పండించాల్సి ఉండగా, 7 లక్షల ఎకరాల్లోనే విత్తనాలు వేశారు. ఇందులో 50 శాతం పంటలు ఎండిపోయాయి. ఈ సమయానికి వరి సేద్యం 3.85 లక్షల హెక్టార్లలో సాగుకావాల్సి ఉండగా 2.29 లక్షల హెక్టార్లలో మాత్రమే సేద్యం జరిగింది. గత సంవత్సరం జూలై 20 నాటికి 46.77 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కాగా, ఈ సంవత్సరం 32.51 లక్షల హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. జూలై 20 తేదీకి గత సంవత్సరం సాగైన వివిధ పంటలను పరిశీలిస్తే వర్షాభావం ఏ విధంగా ప్రభావం చూపిందీ అర్థమౌతుంది.

జులై 20 వరకు ప్రధాన పంటల సాగు విస్తీర్ణం (లక్షలఎకరాల్లో)

| పంట | గతఏడాది | ఈ సంవత్సరం |
|---|---|---|
| వరి | 9.52 | 5.72 |
| మొక్కజొన్న | 9.47 | --- |
| కందులు | 9.57 | 3.30 |
| పెసలు | 6.00 | 3.07 |
| వేరుశనగ | 24.00 | 10.80 |
| ప్రొద్దుతిరుగుడు | 0.35 | 0.10 |
| సోయాబిన్ | 2.90 | 3.25 |
| పత్తి | 25.62 | 30.72 |

రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులను, సాగైన పంటల విస్తీర్ణాన్ని బట్టి రెండు సంవత్సరముల క్రితంనాటి కరువు ప్రమాదం పొంచిఉంది. రాష్ట్రంలోని మొత్తం 1128 మండలాల్లో 649 మండలాల్లో 50 శాతం పంటలు కూడా సాగుకాలేదు. ఇప్పుడు వర్షాలు పడినా వరిసాగు తప్ప ఇతర పంటలు సాగయ్యే పరిస్థితి చాలా తక్కువ. సాధారణ వర్షపాతం లెక్కలు కూడా వాస్తవ పరిస్థితికి అనుగుణంగా లేవు. ఒక నెలలో పడాల్సిన వర్షం, ఒక్కరోజులో కురిసి, మిగతారోజుల్లో కురవకపోయినా, ఆ నెలలో కురిసిన సాధారణ వర్షపాతంగా నమోదు చేస్తారు. ఒక్కరోజు వర్షం కురిసి, మిగతా రోజుల్లో వర్షం కురవకపోతే వర్షాభావ పరిస్థితి నెలకొన్నట్లే.

63 సంవత్సరాల 'స్వతంత్ర' భారతదేశంలో ఇప్పటికే సేద్యం ఎక్కువగా వర్షాల మీద ఆధారపడటం–సేద్యం యొక్క దయనీయ పరిస్థితికి అద్దంపట్టడమేకాక, పాలక ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలని బహిర్గతపరుస్తున్నది. ఇంతకు ముందు వర్షాలు రుతుక్రమంగా పడుతూ ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలు సృష్టిస్తున్న కాలుష్యకారణంగా వాతావరణ సమతుల్యతలో మార్పువచ్చి రుతుక్రమానుగుణంగా వర్షాలు కురవటం లేదు. సగటు ఉష్ణోగ్రత కూడా పెరిగింది. భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు రైతాంగ ప్రయోజనాలకు అనుగుణమైన జల విధానం పాలకులలో లోపించింది. గ్రామీణ ప్రాంతాల నుండి దేశీయ, విదేశీ బడా పరిశ్రమలకు కూలీలను చౌకగా సరఫరా చేసేందుకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను నీటి ఎద్దడి ప్రాంతాలుగా ఉద్దేశపూరితంగానే ఉంచుతున్నారు. అందువలన వర్షపు నీటిని నిల్వచేసే విధంగా నదులపై ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ఒకటో అరో మినహా నిర్మాణం చేయలేదు. వర్షపు నీటితో చెరువులు, బావులు నింపే ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రతి సంవత్సరం ఎంతో విలువైన రెండు వేల టి.ఎం.సి.లకు పైగా వరదనీరు సముద్రం పాలౌతున్నది. పాలకుల జల విధానం ఫలితంగా 3.55 కోట్ల ఎకరాలు సాగుకావాల్సివుండగా కోటి ఎకరాలకు పైగా బీడు భూములుగా మారాయి.

రైతాంగానికి సాగునీరు అందించలేని, ప్రకృతి నష్టాలను నియంత్రించలేని ప్రభుత్వం, సహాయక చర్యల్లోనూ విఫలమౌతూనేఉంది. ప్రజలను ఆదుకోవటంలో మొండిచేయి చూపుతున్నది. 2009–10 సం॥లో రాష్ట్రంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి సేద్యం మూలనబడి, వేసిన పంటలు కూడా ఎండిపోయాయి. 981 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. కరువు పీడిత ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటానని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను కేంద్ర సహాయం మీద ఆధారపడే సహాయక చర్యలుగా దిగజార్చింది. కేంద్రం నుండి 42,533.49 కోట్లు రూ॥ సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరగా 1894.31 కోట్లను మాత్రమే కేంద్రం ప్రకటించింది. 2010–11లో అధిక వర్షాలు, వరదల వలన 15 జిల్లాల్లోని 669 మండలాల్లో 27 లక్షల ఎకరాల్లో పంటలు ముంపుకి గురై 12 వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వమే ప్రకటించింది. సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని 9,373 కోట్లు కోరగా, 481 కోట్లు యిచ్చి కేంద్రం చేతులు దులుపుకొంది. కేంద్రం నుండి ఇంకా సహాయాన్ని రాబట్టే చర్యలు తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం మరో 5 వందల కోట్లను మాత్రమే తన ఖాతా నుండి కేటాయించింది. ఈ విధంగా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలకు సహాయం చేయటాన్ని భిక్ష వేయటంగా చూస్తున్నాయే గాని ప్రజల హక్కుగా గుర్తించటం లేదు. ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు రైతాంగానికి ఏ మాత్రం ఊరటనివ్వలేక పోయాయి. నష్టపోయిన రైతాంగం అప్పుల్లో కూరుకుపోయి వాటి నుండి బయటపడే మార్గం కన్పించక గిజగిజలాడుతున్నారు.

ప్రకృతి వైఫల్యాల వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవటానికి పంటల బీమా పథకం, వాతావరణ బీమా పథకాలను ప్రవేశపెట్టినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది.

(తరువాయి 2వ పేజీలో)

**సంపాదకీయం**

## నార్వేలో మారణకాండ

## టెర్రరిజంపై పోరు బూటకత్వం

**జూలై** 22 నార్వే దేశ రాజధాని ఆస్లో నగరంలో సాగిన బాంబు దాడిలో 8 మంది మృతి చెందారు; రెండుగంటల తర్వాత సమీపంలోవున్న ఉటోయా దీవిలో యువకులపై సాగిన విచక్షణారహిత తుపాకీ కాల్పుల్లో 78మంది మరణించారు. 40 లక్షల దేశజనాభా, 5 లక్షల ఆస్లో నగర జనాభాపై ఈ విషాద ఘటన ప్రభావం తీవ్రంగా వుంటుంది. నార్వే ప్రజలకు "జనశక్తి" తన ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నది.

నిందితుడిగా నార్వే పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టిన 32 ఏళ్ల ఆండర్స్ బెహరింగ్ బ్రెవిక్ తానే నేరం చేశానని ప్రకటించాడు. దేశంలోకి ముస్లింల వలసలను అనుమతించటం ద్వారా నార్వే సంస్కృతిని కలుషితం చేసిన లేబరు పార్టీని నష్టం కలిగించే లక్ష్యంతో దాడి చేశానని చెప్పాడు. మార్క్సిజంపైనా, వామపక్ష భావజాలంపైనా, బహుళ సంస్కృతుల సమ్మేళనావాదంపైనా వాటికి మద్దతు తెలుపుతున్న లేబరుపార్టీ పైనా దాడిచేయటమే తన లక్ష్యమని చెప్పాడు. నార్వేజియన్ లేబరు పార్టీ ముస్లిం వలసలను ప్రోత్సహించే మార్క్సిస్టు పార్టీ అని వాదించాడు.

బ్రెవిక్ వెలిబుచ్చిన ఈ భావాలను త్రొక్కిపట్టేందుకు అతనొక పిచ్చిపట్టినవాడిగానూ, అతనొక్కడే చేసిన చర్యగానూ చిత్రించే ప్రయత్నం ప్రసార సాధనాలు చేశాయి. అయితే ఆ భావాలు పిచ్చిపట్టిన మెదడునుండి వచ్చేవికావు. కాగా రోగగ్రస్త సామాజిక వ్యవస్థ నుండి పుట్టినవి.

ఎరువుల పేరిట రసాయనాలు దిగుమతి, వాటితో బాంబుతయారీ, దాన్ని ప్రభుత్వ కార్యాలయం వద్ద కారులో అమర్చి పేల్చటం, పోలీసు వేషంలో టోయాదీవికి వెళ్లి, అక్కడున్న యువకులను దగ్గరకు రమ్మని పిలిచి కాల్పులు చేయటం, పారిపోతున్న వారిని వెంటబడి తరిమి కాల్చిచంపటం–ఇవన్నీ ప్రణాళికాబద్ధంగా సాగించిన చర్యలు, ఒంటరివ్యక్తి చేసేవి కావు. కోర్టులో అతని ప్రకటన కరుడుగట్టిన ముస్లిము వ్యతిరేకతతో నిండివుంది. వలసవచ్చిన ముస్లిములు యూరపు సంస్కృతిని నాశనం చేస్తున్నారన్నదే అతని ప్రధాన వాదన.

ఈ భావాలు యూరపు దేశాలలోని పాలకవర్గ పార్టీలు వ్యాప్తిచేసినవే. జర్మనీ ఛాన్సెలర్ మార్కెల్, ఫ్రెంచి అధ్యక్షుడు సార్కోజీ, బ్రిటీషు ప్రధాని కామెరాన్‌లు యూరపులో "బహుళజాతుల సహజీవనాని"కి (మల్టీకల్చరలిజం) కాలం చెల్లిపోయిందని వివిధ సందర్భాలలో ప్రకటించారు. ఇస్లాం వ్యతిరేక ఉన్మాదాన్నే ప్రచారానికి కేంద్రంగా చేసుకున్న పార్టీలు ఈనాడు ఆస్ట్రియా, ఇటలీ, నెదర్లాండ్, డెన్మార్క్, హంగరీ దేశాల్లో అధికారంలో వున్నాయి. జాతీయోన్మాద, వలస వచ్చేవారిని ద్వేషించే కార్యక్రమాన్ని చేపట్టి ఫ్రాన్సులో ఒక నేషనల్ ఫ్రంటు ఏర్పడింది. ఇది అధికారం చేజిక్కించుకునేందుకు తీవ్ర పోటీ యిస్తున్నది. నార్వేలో ముస్లిము వ్యతిరేకతే ప్రధానమైన నార్వేజియన్ ప్రోగ్రెస్ పార్టీ ప్రధాన రాజకీయ స్రవంతిలో భాగమైంది. 20శాతం ఓట్లు పొంది, రెండవ పెద్దపార్టీ అయింది. 2009 వరకూ పదేళ్లపాటు ఈ పార్టీ సభ్యుడిగా బ్రెవిక్ వున్నాడు.

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణలో అమెరికా సామ్రాజ్యవాదులకు తోడుగా నార్వే తన సైన్యాలను పంపింది. లిబియాపై అమెరికా, నాటో కూటమి సాగిస్తున్న యుద్ధానికి మద్దతు తెలుపుతున్నది. టెర్రరిస్టు ప్రమాదంనుండి నార్వేనూ, మొత్తం యూరపు ప్రజలను కాపాడటానికి ఇలాంటి సైనిక జోక్యాలవసరమని వాదించింది. కానీ ఇప్పుడు జరిగింది ముస్లిం టెర్రరిస్టులు చేసిన దాడి కాదు. నార్వే మధ్యతరగతి వర్గానికి చెందిన క్రిస్టియన్ యువకుడు (ఒక్కడేనా?) చేసిన టెర్రరిస్టు దాడి అది. టెర్రరిస్టు దాడినుండి ప్రజలను రక్షించటమన్నది బూటకమని తేలిపోయింది.

బ్రెవిక్ తన కోర్టు ప్రకటనలో ఒక జర్మనీ పత్రికా సంపాదకుడి రచనలనుండి విస్తృతంగా ఉల్లేఖనలిచ్చాడు. "మంచికి ఇరుసు" అన్న రచననుండి బ్రెవిక్ చేసిన ఉల్లేఖనలన్నీ "ఇస్లాంకు యూరోపియన్లు లొంగిపోతున్న" ప్రమాదాన్ని గురించి హెచ్చరించేవే. యూరపు పాలక వర్గాలు సాగిస్తున్న ముస్లిం వ్యతిరేక ప్రచార ప్రభావం బ్రెవిక్‌పై తీవ్రంగా వుందన్నది స్పష్టమే.

2001 సెప్టెంబరు 11న ప్రపంచ వాణిజ్య కేంద్ర భవనాలపై టెర్రరిస్టు దాడి జరిగిననాటినుండీ, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఇప్పుడు లిబియాపై సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాలకు ప్రజలనుండి మద్దతును సమీకరించటానికి ముస్లిము వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొట్టడాన్ని దోపిడీ పాలక వర్గాలు సాధనంగా చేసుకున్నాయి. ఇరాక్‌పై యుద్ధాన్ని "ధర్మయుద్ధం"గా పేర్కొన్న బుష్‌కూ, "ధర్మయుద్ధ" యోధుడి పునర్జన్మితుడిగా తనకు తాను వర్ణించుకున్న బ్రెవిక్‌కూ మధ్య భావాలరీత్యా తేడా ఏమీ లేదు.

అదే సమయంలో వలసవచ్చిన ముస్లింప్రజలకు వ్యతిరేకంగా ఉన్మాదాన్ని రెచ్చగొట్టడంద్వారా యూరపు దేశాల కార్మికవర్గాన్ని చీల్చివేసి, దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా వారిలో పెరుగుతున్న అశాంతి, ఆగ్రహాలను పచ్చి మితవాద చర్యలవైపు మళ్లించే పనిలోనే యూరపు పాలకవర్గాలున్నాయి.

(తరువాయి 2వ పేజీలో)

## అయోడిన్ కలిపిన ఉప్పు

# ప్రభుత్వ విధానాన్ని తప్పుపట్టిన సర్వోన్నత న్యాయస్థానం

**భారత** ప్రజలలో వున్న అయొడిన్ లోపవ్యాధుల నివారణకు, అయొడిన్ కలిపిన ఉప్పును మాత్రమే అమ్మాలనీ, కల్లుప్పు అమ్మకాలపై నిషేధాన్ని విధిస్తూ భారత ప్రభుత్వం ఆజ్ఞలు జారీచేసింది. ఫలితంగా ఉప్పు తయారీ రైతాంగం యిబ్బందుల పాలవగా, బడా కంపెనీలు అయొడిన్ కలిపిన ఉప్పును అధిక ధరలకు అమ్ముకుని లాభాలు పొందాయి.

కల్లుప్పులో సహజంగా ఉండే అయొడిన్ మానవులలో అయొడిన్ లోపం ఏర్పడకుండా సరిపోతుందనీ, అయొడిన్‌లోపం ఎక్కువగావున్న కొన్ని ప్రాంతాలలో నివసించే ప్రజలకు అయొడిన్ కలిపిన ఉప్పును చౌకధరలకు సరఫరా చేస్తే సరిపోతుందనీ, కొద్దిమంది పరిశ్రమాధిపతులకు లాభాలు చేకూర్చేందుకు వండివార్చిన గణాంకాలతో కల్లుప్పుపై నిషేధం విధించారనీ ఆనాడు "జనశక్తి" విమర్శించింది.

దీనిపై వివాదం భారత సర్వోన్నత న్యాయస్థానం ముందుకు చేరింది. శాస్త్రీయ పరిశోధనల సమాచారాన్ని పరిశీలించిన న్యాయస్థానం 10శాతం జనాభా మాత్రమే అయొడిన్ లోపానికి గురౌతున్నారనీ, మిగిలిన 90శాతం జనాభాపై చెడుప్రభావం చూపేవిధంగా అయొడిన్ కలిపిన ఉప్పు వాడకాన్ని తప్పనిసరి చేయటం సరైన విధానం కాదనీ, చాలా దేశాలు అవసరమున్నవారికే అయోడిన్ కలిపిన ఉప్పును సరఫరా చేసే పద్ధతిననుసరిస్తున్నాయనీ, చట్టంద్వారా దానిని వినియోగించమని ఆజ్ఞాపించటం లేదనీ చెప్పింది. "సార్వజనీన అయొడిన్ ఉప్పు" విధానాన్ని సమీక్షించుకుని శాస్త్రీయ విజ్ఞానాన్ని బట్టి ఆరునెలల్లో తగిన విధానాన్ని మళ్ళీ రూపొందించమని కేంద్ర ప్రభుత్వాన్ని ఆజ్ఞాపించింది.

ఈ నిషేధాన్ని విధించిన ఆహార కల్తీ నిరోధ చట్టాన్ని పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం పైచట్టం ప్రకారం నిషేధం చెల్లదని తీర్పిచ్చింది. ఒక ఆహార పదార్ధాన్ని, ఎలాంటి కల్తీలేకుండా, దాని సహజ రూపంలోనే సరఫరా చేస్తున్నప్పుడు, జనాభా ఔషధం కలిపిన ఆహార పదార్ధాన్ని వాడాలంటూ దాని నిలువ, అమ్మకాలను నిషేధించటం ఆహార కల్తీ నిరోధచట్టం పరిధిలోకి రాదని, కల్లుప్పుపై నిషేధం విధించిన రూలు 44-1 చెల్లదని కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అంతేకాక అలాంటి నిషేధం రాజ్యాంగ చట్ట విరుద్ధమని కూడా పేర్కొంది. ప్రజల ఆరోగ్యం కాపాడాలన్న మంచి ఉద్దేశ్యం ప్రభుత్వానికున్నంత మాత్రాన దానికోసం చేసిన చట్టాన్ని సమర్ధించలేమనీ, అయొడిన్ లోపాన్ని సరిదిద్దేందుకు ప్రజలందరూ అయొడిన్ కలిపిన ఉప్పు వాడాలని నిర్బంధించటాన్ని సమర్ధించజాలనని న్యాయమూర్తి ఆర్.వి.రవీంద్రన్ వ్యాఖ్యానించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం తాను చేసిన తప్పును అంగీకరించి సరిచేసుకుంటుందా? ✤

## గుజరాత్ పగటి కలగా మిగిలిన నీటి పారుదల

**నాలుగు** దశాబ్దాల క్రితం నర్మదా ప్రాజెక్టు నిర్మాణం మొదలుపెట్టినప్పుడు, అది గుజరాతుకు జీవనప్రదాత అవుతుందనీ, రైతాంగం కలలు ఫలించి, కరవు భూములకు నీరందుతుందనీ ప్రచారం చేశారు. నర్మదా నది నీటిని భూములకు చేరవేసే కాలువల నిర్మాణానికి రూ॥ 29 వేల కోట్లు ఖర్చు చేశారు. కానీ ఈనాటికీ సాగునీరు పగటికలగానే వుండిపోయింది. 'స్వర్ణిమ్ గుజరాత్' నినాదాల హోరు సాగుతుండగా సాగునీటి కోసం రైతాంగం ఈ నాటికీ ఎదురు చూస్తూనే వున్నారు. వచ్చిన నీరు మాత్రం 10 వేల లీటర్లుకూ 10 రూ॥ల చొప్పున పరిశ్రమాధిపతులకు చేరుతున్నది. వేలకోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాలువలు నేడు జీర్ణావస్థకు చేరాయి. చాలా చోట్ల అవి పూడిపోయాయి. గట్లు తెగిపోయివున్నాయి. 2002లో నీరు వదిలితే 8 చోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. 2003లో రెండుచోట్ల గట్లు కోసుకుపోయి 18 గ్రామాలు మునిగిపోయాయి. 2008లో సుజాతపూర్ వద్ద పడినగండి ఆ ప్రాంత ప్రజాజీవనాన్ని కల్లోలం చేసింది. ఢోకా, బల్వా, సనంద్ మొదలగు పట్టణాల వద్దగల కాలవలును ఎవరైనా చెపితేతప్ప గుర్తుపట్టలేని స్థితిలో వున్నాయి. ఏనాడూ సాగునీరు భూములకు చేరలేదు.

వీటి నిర్మాణానికి ఖర్చుపెట్టిన 29వేల కోట్ల రూ॥లు ఏమయ్యాయో తెలుపని ప్రభుత్వం, కాలువల కోసం మళ్లీ రూ॥ 40 వేల కోట్లను కేటాయించింది. ఈ నిధులెటుమళ్లుతాయో ఊహకందదు.

సాగునీరు అందక రైతాంగం కష్టాల కడలిలో వున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి వున్నారు. పేద రైతుల భూములను కబ్జా చేయటానికి మాఫియా కాచుకుకూర్చుంది. విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు నరేంద్రమోడీ నిర్వహిస్తున్న మేళాలు ఈ భూ కబ్జాదారుల నోళ్లూరిస్తున్నాయి. 2020 నాటికి లక్ష హెక్టార్ల భూమిని పరిశ్రమలకోసం సేకరిస్తానని ప్రభుత్వం ప్రకటించింది. రైతాంగం నుండి భూమిని గుంజుకునేందుకు ప్రభుత్వం అన్ని కుట్రలనూ, పద్ధతులనూ అనుసరిస్తుంది. రైతాంగానికి సాగు నీరందకుండా చేయటం దీనిలో భాగమే.

**(జన్ సంఘర్ష్ ఏలాన్ పత్రికలోని వార్త ఆధారంగా)**

✤

**దుర్భిక్ష ...** (మొదటి పేజీ తరువాయి )

ఈ పథకాలు కూడా రైతాంగాన్ని ఆదుకునే విధంగా లేవు. పంటల బీమా పథకాన్ని మొదట మండలస్థాయిలో అమలు పర్చారు. మండలంలోని అత్యధిక గ్రామాల్లో 50 శాతం పైగా పంటనష్టం జరిగినప్పుడే ఈ పథకం వర్తిస్తోంది. పంట నష్ట పోయిన శాతాన్ని బట్టి అప్పుడు పరిహారం యిస్తారు. దీనిపైన తీవ్ర విమర్శలు రావటంతో బీమా పథకాన్ని అమలు జరుపుతామని చెబుతూనే, ఒక పంటకు మాత్రమే వర్తింపచేస్తామని చెప్పటం ద్వారా అదికూడా రైతాంగానికి ప్రయోజనం లేకుండా పోయింది. పరిహారం చెల్లింపుల్లోను అనేక నిబంధనలు విధించటంతో రైతాంగానికి అందేది నామమాత్రంగానే ఉంది. వాతావరణ బీమా పథకం వర్తించటానికి విధించిన మార్గదర్శకాలు, ఆ పథకాన్నే అపహాస్యం చేస్తున్నాయి. వర్షానికి-వర్షానికి మధ్య 40 రోజుల వ్యవధి ఉండాలి. ఈ వ్యవధిలోపు చినుకులు, జల్లులు పడ్డా 'డ్రైస్పెల్'గా ఈ పథకం పరిగణించదు. దీన్ని గమినించినప్పుడు ఆచరణలో ఈ పథకం అమలు జరగదని చెప్పకనే చెబుతున్నది. ప్రభుత్వం తెచ్చిన ఈ పథకాలన్నీ రైతాంగాన్ని మభ్యపెట్టే పథకాలు తప్ప వారి ప్రయోజనాలను మాత్రం కాపాడేవి కావు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ క్రింది చర్యలు వెంటనే చేపట్టాలి. వర్షపాతం తక్కువగా ఉన్న అన్ని ప్రాంతాలను దుర్భిక్ష ప్రాంతాలుగా ప్రకటించాలి. పంటలు నష్టపోయిన రైతులకు పంట వేయటానికి అయిన ఖర్చును పూర్తిగా యివ్వాలి. గత సంవత్సరం, ఈ సంవత్సరం బ్యాంక్ అప్పులను రద్దు చేయాలి. గ్రామీణ పేదల వలసలను నివారించటానికి ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, 5వేల రూపాయల ఉచిత సహాయంతో పాటు ఉపాధి పనులు ప్రారంభించాలి. పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో తిరిగి పంటలు వేసుకోవటానికి స్వల్పకాలిక విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలి. నిబంధనలతో నిమిత్తం లేకుండా పంటల బీమా, వాతావరణ బీమా పథకాలను అమలు జరిపి పరిహారం చెల్లించాలి. చెరువులకు యుద్ధ ప్రాతిపదికపై మరమ్మత్తులు చేసి వర్షపు నీటిని వాటికి మళ్లించాలి. ఈ చర్యలు వెంటనే చేపట్టాలని రైతాంగం - గ్రామీణ పేదలు సమైక్యంగా ఉద్యమించాలి. ✤


**నవయువ సమాఖ్య (NYS) ప్రచురణ**

**రాష్ట్ర విద్యార్థి, యువజన సమ్మేళనం**




**సావనీర్**

కాపీలకు :

**మైత్రీ బుక్ హౌస్**

28-9-1,

జలీల్ వీధి,

కారల్‌మార్క్స్‌రోడ్,

విజయవాడ-2


## పశ్చిమబెంగాల్ భూమి స్వాధీనంకోసం పోరాటం

**బీర్భూమ్ జిల్లా,** మురారీ ప్రాంతంలో ఖాన్పూర్ గ్రామంలోని భూమిలేని పేదలు 210 బీగాల భూమిని స్వాధీనం చేసుకుని, దానిలో విత్తనాలు వేసుకున్నారు. సాంప్రదాయక ఆయుధాలు చేపట్టి రెండురోజులపాటు వారీ కార్యక్రమాన్ని సాగించారు.

ఈ భూమి ఒక జమీందారుకు చెందినది. వామపక్ష ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుని 22 మందికి పట్టాలు యిచ్చింది. కానీ భూమిని వారికి స్వాధీన పరచలేదు. ఆ జమీందారు కొడుకు గులామ్ హైదర్, అల్లుడు లాల్‌మియాన్‌లు గత 30 ఏళ్లుగా ఆ భూమిని తమ స్వాధీనంలో వుంచుకుని పట్టాదారులను అందులోకి రానివ్వలేదు. కొంతమంది నుండి పట్టాలను కూడా లాగివేసుకున్నారు. స్థానిక భూసంస్కరణ కార్యాలయంలో వీటికి సంబంధించిన రికార్డులు కూడా గల్లంతయ్యాయి. సంగ్రామి కృషక్ కమిటీ నాయకత్వంలో రైతాంగం కదలి భూమిని స్వాధీన పరుచుకున్నారు.

ఈ భూమికి రైతాంగానికి పట్టాలివ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నారు. అంతవరకూ ఉమ్మడి వ్యవసాయం సాగిస్తామని చెబుతున్నారు. పంటలో సగభాగాన్ని ఉమ్మడిగా వుంచుకుని, మిగిలిన సగాన్ని సాగుచేసి రైతులు పంచుకుంటారని చెప్పారు. ఇది భూ సంస్కరణల అమలులో రెండవ దశనీ, దీనిని వామపక్ష ప్రభుత్వం చేపట్టలేక పోయిందనీ అన్నారు.

**(టైమ్స్ ఆఫ్ ఇండియా 5-6-2011 నుండి)**

✤

## తమిళనాడు బీమా ముసుగులో వైద్యరంగం ప్రైవేటీకరణ

**రాజశేఖరరెడ్డి** పాలనా కాలంలో కాంగ్రెసు ప్రభుత్వం 108 అంబులెన్స్ సేవలనూ, ఆరోగ్యశ్రీ పేరున బీమా పథకాన్ని, 104 సంచార వైద్యశాలలను ప్రారంభించింది. వీటన్నింటికీ రాజీవ్‌గాంధీ పేరు పెట్టారు. ఆరోగ్యశ్రీ పథకం కార్పోరేటు ఆస్పత్రులకు ప్రభుత్వ నిధులను తరలించి, ప్రభుత్వ ఆస్పత్రులను దిగనాసిల్లచేసింది. ఈ పథకానికి వెచ్చించిన నిధులను ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధికి వెచ్చించి వుంటే అన్నిరకాల వ్యాధులకూ పేదలకు ఉచిత వైద్యం అందివుండేది. కాగా పేదలు తరచుగా గురయ్యే వ్యాధులకు వైద్యం అందుబాటులో లేకుండాపోయింది. 90శాతం ప్రభుత్వ నిధులతో ప్రైవేటు కంపెనీలు నిర్వహిస్తున్న 108, 104 సేవలు చిక్కుల్లో పడ్డాయి. 40శాతం అంబులెన్సులు మరమత్తులకు నోచుకోక మూలనపడ్డాయి. తాను నిధులు సమకూర్చుతున్న ఈ పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. వీటిని పునరుద్ధరించేందుకు నిధులెలా తెస్తారో చెప్పలేదుగానీ, దిగజారిన ఈ సేవలను తానే నిర్వహించి, ప్రైవేటు నిర్వహణే బాగుందనిపించాలను కుంటున్నారేమో వేచి చూడాలి.

ఈ ఆరోగ్య బీమా పథకం పనితీరు యిలా వుండగా, తమిళనాడులోని గత డిఎంకే ప్రభుత్వం కరుణానిధి పేరిట కలైజ్ఞార్ ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎంపికచేసిన కార్పోరేటు ఆస్పత్రులలో 642 రకాల వైద్యసేవలను ప్రభుత్వ బీమా ప్రిమియం చెల్లించిన బీమా కంపెనీ ప్రజలకు అందజేస్తుంది. ఇది ప్రైవేటు బీమా కంపెనీకి, కార్పోరేటు ఆస్పత్రులకూ లాభాలు చేకూరుస్తున్నదని విమర్శలు ఆనాడు వచ్చాయి. జయలలిత నాయకత్వంలో ఏఐడిఎంకే కూడా ఈ విమర్శ చేసింది.

ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన జయలలిత ఈ పథకానికి కొత్తరూపం యిచ్చింది. 950 రకాల వైద్యసేవలను ఈ పథకంలో చేర్చటంతోపాటు, ప్రభుత్వ ఆస్పత్రులను కూడా ఈ పథకంలో చేర్చారు. ఈ పథకానికి కరుణానిధి పేరును తొలగించింది. మిగతా పథకంలో మార్పేమీ లేదు.

ఈ పథకం ప్రకారం ప్రభుత్వం గుర్తింపు కార్డులిచ్చిన కుటుంబాలలోని సభ్యులు నాలుగేళ్లలో నాలుగు లక్షల రూ॥ల వైద్యసేవలను పొందటానికి అర్హులవుతారు. కరుణానిధి పథకంలో ఇది లక్ష రూపాయలుగా వుంది. పొందిన వైద్యసేవలకు చెల్లింపులు నాలుగురెట్లు పెరిగినందున ప్రైవేటు బీమా కంపెనీకి ప్రభుత్వం చెల్లించే ప్రీమియం కూడా కనీసం నాలుగరెట్లు పెరుగుతుంది. ప్రభుత్వ ఆస్పత్రులను చేర్చినందువల్ల ప్రభుత్వ వైద్యవ్యవస్థకు అదనంగా చేకూరే నిధులేమీ వుండవు. వాటికి ఇస్తున్న నిధులు తగ్గుతాయనీ, బీమా పథకం క్రింద అవి అందించే వైద్యసేవలు నామమాత్రంగానే వుంటాయన్నది (ఆంధ్రప్రదేశ్‌లో 13 శాతం ఆరోగ్యశ్రీ కేసులకు మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రులు వైద్య సేవలందించాయి) స్పష్టమే.

కనుక, కరుణానిధి పథకంపై వచ్చిన విమర్శలన్నీ జయలలిత పథకానికి కూడా వర్తిస్తాయి. ప్రభుత్వం వైద్యసేవలందించవలసిన బాధ్యతనుండి తప్పుకొనటమే రెండు పథకాలలోని ఉమ్మడి అంశం. అందుకే ఈ పథకంపై చర్చఅంతా కరుణానిధి పేరు తొలగించటం చుట్టూ, నిధుల కేటాయింపు పెంచటం చుట్టూ జరుగుతున్నది. అసలు సమస్యనుండి ప్రజల దృష్టి మళ్లించటమే పాలకవర్గాల లక్ష్యం. ✤

**నార్వేలో...** (మొదటి పేజీ తరువాయి )

యూదువ్యతిరేక ఉన్మాదాన్ని నాజీ హిట్లరు వినియోగించుకుని నిరంకుశ పాలన సాగించినట్లుగానే, ముస్లిం వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొట్టి తమ పాలనను కాపాడుకునే ప్రయత్నంలోనే యూరపు దేశాల నేటి పాలకులున్నారు. సర్వవ్యాపిత సంక్షోభంలో కూరుకుపోయిన యూరపు ప్రభుత్వాలు సంక్షోభభారాన్ని ప్రజలపై మోపేందుకు తీసుకున్న చర్యలకు కార్మికవర్గంనుండి వ్యతిరేకత రాకుండా వారిని చీల్చివుంచేందుకు పూనుకున్నాయి.

ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకే యూరపు బూర్జువా వర్గం అబద్ధపు ప్రచారానికి పూనుకుంది. బ్రిటిష్ పత్రికా రచయిత సైమన్ జెన్కిన్స్ గార్డియన్ పత్రికలో ఇలా వ్రాశాడు: "నార్వేలో విషాదం. ఒక విషాదకర ఘటన మాత్రమే. అంతకుమించి మరేమీ కాదు. 86 మందిని కాల్చిచంపటంలో ఏ తప్పు కన్పించని వ్యక్తి ఎంత పిచ్చివాడంటే మానసిక వైకల్య శాస్త్రానికీ, మెదడు వైద్యానికీ మాత్రమే అతను పనికివస్తాడు. దీనికి రాజకీయాలేవీ లేవు".

32 ఏళ్ల మధ్యతరగతి యువకుడు హంతకుడెలా అయ్యాడు? ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, ఇరాక్‌లోనూ, పాలస్తీనాలోనూ వేలాది యూరపు, అమెరికా యువకులను-బహుశా అనేకమంది ఇతనికంటే చిన్న వయసువారై వుంటారు-శిబిరంలో కూర్చుని కంప్యూటరుద్వారా పైలెట్లులేని విమానాలతో గ్రామాలను బాంబులతో నేలమట్టంచేసి మారణకాండ సాగిస్తున్న హంతకులుగా మార్చిందెవరు? బ్రెవిక్ బాంబును తానే తయారు చేసుకున్నాడు. ఆ వందలాది యువకులు వాడుతున్న ఆయుధాలు వారు తయారుచేసినవి కావు. యుద్ధ పరిశ్రమాధిపతులు వారి చేతుల్లో పెట్టారు. ఇటు బ్రెవిక్, అటు సైనికులు ఈ మారణకాండను సాగించేందుకు ఊతమిచ్చిన భావజాలం మాత్రం వారిది కాదు. ద్రవ్యపెట్టుబడి తన లాభార్జనకోసం ప్రజల మనసులను ఉన్మాదభరితం చేసేందుకు సృష్టించిన ఫాసిస్టు భావజాలమది.

"మనమిప్పుడు టెర్రరిజంపై పోరు సాగిస్తున్నాం." ఈ మాటలన్నది బ్రెవిక్ కాదు. అధ్యక్షుడు బుష్. ఇదే సామ్రాజ్యవాద వ్యవస్థ. మనుషులలో మానవత్వాన్ని హరించే వ్యవస్థ. పౌరుల స్వేచ్ఛలను కాలరాచే వ్యవస్థ. ప్రజలను దోపిడీ, అణచివేతలకు గురిచేసే వ్యవస్థ. మార్క్స్ మాటల్లో "మానవత్వాన్ని రక్తమాలిన్యాలతో పడలాగకుండా ఈషణ్మాత్రపు ముందడుగు కూడా వేయలేని", "తాను సంహరించిన వారి పుర్రెలలోనే సురాపానంచేసే భయంకర పూజావిగ్రహమూర్తి" ఈ వ్యవస్థ.

బుష్, ఒబామా, నార్వే ప్రధాని స్టోల్టెన్‌బర్గ్‌లు ఆఫ్ఘనిస్తాన్ ఇరాక్, లిబియాలలో ఏంచేశారో, చేస్తున్నారో, అదే బ్రెవిక్ నార్వే ప్రజలకు చేశాడు. అదే పాశవిక హత్యాకాండ. మానవాళిపై అమానవీయ ప్రవర్తనను రుద్దుతున్న వ్యవస్థ. వేల సంవత్సరాల మానవాళి విజ్ఞాన ప్రగతిని ఆటవికన్యాయ స్థాయికి దిగజార్చుతున్న వ్యవస్థ. ఈ దోపిడీ వ్యవస్థకు చరమగీతం పాడకుండా మానవాళి పురోగతి సాధించలేదు. ✤

# అమెరికా సామ్రాజ్యవాదం

## రుణ పరిమితి పై చర్చ-శ్రామిక ప్రజలపై దాడికి కప్పిన తెర

**అమెరికాలోని** పాలకవర్గ పార్టీలైన డెమోక్రాటిక్, రిపబ్లికన్ పార్టీలు ప్రభుత్వం చేయగల రుణంపై పరిమితి విధింపును పెంచాలన్న అంశంపై చేతులు కలిపి సంక్షోభం ఏర్పడినట్లు నాటకమాడుతున్నాయి. అమెరికా ప్రజల జీవన ప్రమాణాలు, జీవన, సామాజిక హక్కులపై తీవ్రదాడి చేయటమే దీని లక్ష్యం.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత సామ్రాజ్యవాదం సర్వసాధారణ (జనరల్) సంక్షోభంలో పడిందని కా॥ స్టాలిన్ సూత్రీకరించారు. దానిని నిజం చేస్తూ ప్రతిఏడూ, ప్రతినిత్యం సామ్రాజ్యవాద వ్యవస్థ ఆర్థిక సంక్షోభాలలో వుంటూ వస్తున్నది. ఆర్థిక మాంద్యత, ద్రవ్యోల్బణం, మాంద్యద్రవ్యోల్బణం (స్టాగ్‌ప్లేషన్) ద్రవ్య వ్యవస్థ నీరుగారటం, గృహరుణ తిరిగి చెల్లింపులలోటు వంటి ఎన్ని పేర్లు పెట్టినా, ఇది పెట్టుబడిదారీ విధానపు సర్వవ్యాపిత సంక్షోభంలో భాగమే.

2008లో అమెరికాలో ఏర్పడిన ద్రవ్య వ్యవస్థ నీరుగారిపోవటమని పిలిచింది ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్నే. ఈ సంక్షోభభారాన్ని ప్రపంచ ప్రజలపై (అమెరికాతో సహా) రుద్దేందుదుకు అమెరికా పూనుకుంది. ఆనాడు అది తీసుకున్న చర్యలేమిటి?

అమెరికా పార్లమెంటు ఉభయసభల్లోనూ డెమోక్రాటిక్ పార్టీకి మెజారిటీ ఉన్న సమయంలో, అంటే ఒబామా పాలన మొదటి రెండేళ్ళలో, ధనాఢ్యవర్గాలపై పన్నులు పెంచేందుకు నిరాకరించింది. బ్యాంకులను రక్షించేందుకు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించింది. కాగా ఆర్థిక మాంద్యత, దానినను సరించి 2008లో వచ్చిన ద్రవ్య సంక్షోభాల ఫలితంగా ఉద్యోగాలు కోల్పోయిన లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఒక్క చర్య కూడా తీసుకోలేదు. ఆ సమయంలో యూరపులోనూ అమెరికాలోనూ బ్యాంకులకు దాదాపు 16 లక్షల కోట్ల డాలర్లను అందజేశారు. ఇది అమెరికా స్థూల జాతీయ ఉత్పత్తి కంటే ఎక్కువ. ఒక్క సిటీ బ్యాంకుకే 2 లక్షల 50 వేల కోట్ల డాలర్ల ధనాన్ని అందజేశారు. ఇది 5 దేశాలు తప్ప మిలిగిన అన్ని దేశాల స్థూల జాతీయోత్పత్తి కంటే ఎక్కువ. ఈ భారాన్ని సామాజిక వ్యయంలో కోత విధించటం ద్వారా అమెరికా ప్రజలపై మోపారు. అలాగే యురోపు బ్యాంకులకు కూడా ఉద్దీపనా పథకాలను అమలు జరపమని, వడ్డీరేట్లు పెంచమని అమెరికా వత్తిడి చేసింది. ఇది యూరోపు సామ్రాజ్యవాదులకు (ప్రధానంగా జర్మనీ, ఫ్రాన్సులు) అమెరికా సామ్రాజ్యవాదులకు మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. ఏమైనా కొన్ని మార్పులతో యూరపులో అమలు జరిగిన ఉద్దీపనా పథకాలుకూడా ప్రజలపై సంక్షోభ భారాన్ని మోపాయి.

ఫలితంగా 15 శాతం అమెరికా కుటుంబాలు అంటే 1.74 కోట్ల కుటుంబాలు అంటే దాదాపు 5 కోట్ల మంది 2010లో సరిపడినంత ఆహారం కొనుగోలు చేయలేని పేదరికంలో కూరుకుపోయారు. నిరుద్యోగం రెండంకెల స్థాయికి చేరింది. ఈ ఉద్దీపనా చర్యలేవీ సంక్షోభాన్ని తగ్గించలేక పోయాయి. బ్యాంకుల బాలన్సుషీట్లు లాభాలు చూపించాయి. కానీ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడలేదు. దీనితో మరింత ధనాన్ని ప్రభుత్వం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాని కోసం ప్రభుత్వం రుణాన్ని చేయాలి. చట్టప్రకారం ప్రభుత్వం చేయగల రుణం నిర్దేశితమైవుంది. గనుక, చట్టాన్ని సవరించి ఎక్కువ రుణం చేసేందుకు అవకాశం కల్పించాలి. అయితే పెరిగిన రుణం మేరకు ప్రభుత్వం ఇతర ఖర్చులను తగ్గించుకోవాలి. అలాగే పన్నులు పెంచి ఆదాయం పెంచుకోవాలి. సామాజిక వ్యయాన్ని తగ్గించి ప్రజలపై భారాన్ని పెంచే విధానాన్ని అమెరికా పాలకవర్గాలు చేపట్టాయి.

2010 డిసెంబరులో ఒబామా రిపబ్లికన్లతో రాజీ చేసుకున్నాడు. బుష్ పాలనలో ధనాఢ్య వర్గాలపై తగ్గించిన పన్నులను మరోరెండేళ్ళు పొడిగించటానికి అంగీకరించాడు. రుణ పరిమితి విధింపు సడలించటాన్ని వాయిదా వేశాడు. రిపబ్లికన్లకు మెజారిటీ రావటంతో రుణ పరిమితి విధింపును పెంచాలని డిమాండు చేశారు. దీనిని అంగీకరించటం ద్వారా సామాజిక వ్యయాన్ని కోత పెట్టే అవకాశం వస్తుందని భావించిన ఒబామా తానే రుణపరిమితిని పెంచుతూ బిల్లును పెట్టాడు.

రుణ పరిమితి పెంచాలన్న అంశంపై రెండు పాలకవర్గ పార్టీల మధ్యా ఎలాంటి తేడాలేదు. పెంచిన రుణ పరిమితి మేరకు సామాజిక వ్యయంలో కోత విధించాలన్న అంశంలోనూ వాటి మధ్య విబేధించలేదు. ఆ కోత ఎంత వుండాలి? ఎంతకాలం వుండాలన్న దానిపైనే వారికి విబేధాలున్నాయి. ఇది తీరితే తప్ప రుణ పరిమితి పెంపుకు ఆమోదం తెలుపబోమంటూ, అసలు సమస్య యిదేనన్నట్లుగా చిత్రిస్తున్నారు. రాజీగా రిపబ్లికన్ పార్టీ ప్రతిపాదన ఇలావుంది. రుణపరపతి పెంపుదల జరిగితే 3 లక్షల కోట్ల డాలర్ల మేరకు పదేళ్లలో సామాజిక వ్యయంలో తగ్గించాలి. ఇందులో రెండుభాగాలున్నాయి. మొదటగా నాన్‌ఎన్‌టైటిల్‌మెంటు కార్యక్రమాల్లో (విద్య, పర్యావరణం, రవాణా తదితర రంగాలు) లక్షా 20 వేల కోట్ల డాలర్లు కోత విధించాలి. రెండవదశలో వైద్య, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత (నిరుద్యోగ భృతి వంటివి) కార్యక్రమాల్లో లక్షా80వేల కోట్ల కోత పెట్టాలి.

దీనికి ప్రతిగా డెమోక్రాట్ల ప్రతిపాదన రుణ పరిమితి పెంచగానే రెండు దశల్లో కాకుండా వెంటనే సామాజిక వ్యయంలో రెండులక్షల 70 వేల కోట్ల డాలర్లు కోత పెట్టాలి, వైద్య ఆరోగ్య, సామాజిక భద్రతా కార్యక్రమాల్లో కోతను 2012 అధ్యక్ష ఎన్నికలు ముగిసేవరకూ వాయిదా వెయ్యాలి. అప్పటివరకూ కొత్తగా ఎలాంటి పన్నులు వేయరాదు.

ఈ అంశంపై దేశప్రజలనుద్దేశించి ఒబామా టెలివిజన్ ప్రసంగంలో వైద్యసేవలతో సహా సామాజిక వ్యయంలో ప్రభుత్వకోత విధించాలనీ ధనికుల నుండి ఏమీ తీసుకోరాదనీ రిపబ్లికన్లు కోరుతున్నారనీ, ఇది "కోత ఒక్కటే" అన్న వైఖరినీ కాగా తనది సమతుల్య వైఖరినీ చెప్పాడు. కాగా రెండు పార్టీలు అంగీకరించిన మేరకు కోతవల్ల ప్రజల జీవితాలపై పడబోయే వినాశకర ఫలితాలను గురించి ఒక్క గణాంకాన్ని కూడా పేర్కొనకుండా జాగ్రత్త పడిన ఒబామా, ధనికులపై వేసిన కొద్దిపాటి పన్నులనుంచి వచ్చే ఆదాయాపు లెక్కలు మాత్రం ఘనంగా పేర్కొన్నాడు. ఇవన్నీ కలిపినా కొన్ని వేల కోట్ల డాలర్లు మాత్రమే. ఇది తన కార్మిక వర్గ వ్యతిరేక విధానాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే.

ఇక చర్చంతా రుణపరిమితి పెంపు బిల్లు ఆమోదం పొందకపోతే ఏమౌతుంది అన్న వూహాగానాల చుట్టూ త్రిప్పుతున్నారు. బిల్లు ఓడిపోతే (అంటే రిపబ్లికన్ల ప్రతిపాదన గెలిస్తే) అధ్యక్షుడు ఎమర్జెన్సీ ప్రకటించి, పార్లమెంటుకు అధికారాలు లేకుండా చేస్తాడనీ ఇది ప్రజాస్వామ్యానికి పెనుముప్పు అని కొందరు వూహిస్తుంటే, బిల్లు ఓడిపోతే వివిధ దేశాల్లో యుద్ధాలు చేస్తున్న అమెరికా సైనికులకు జీతాలు చెల్లించలేరనీ, ఆహారాన్ని అందించలేరనీ, విమానాశ్రయాల్లో ట్రాఫిక్ కంట్రోలర్లకు జీతాలు చెల్లించలేరనీ, దేశ విదేశాల్లో అమెరికా కుప్పకూలి పోతుందనీ మరికొందరు ఊహిస్తున్నారు. దీనిపై అంతులేని చర్చలు సాగిస్తున్నారు. అమెరికా భవితవ్యం దీనిపైనే ఆధారపడినట్లు చిత్రిస్తున్నారు. ఈ చర్చంతా, రెండు ప్రతిపాదనల్లో ఏది గెలిచినా అమెరికా శ్రామిక ప్రజల జీవితాలు దుర్భరమవుతాయన్న వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నది.

రీగన్ అధ్యక్షుడిగా వున్నప్పుడు అమెరికా రిజర్వు బ్యాంకుకు గవర్నరుగా పనిచేసిన పాలెక్రెగ్ రాబర్ట్సు ఈ వివాదంపై ఇలా అన్నాడు.

"1930లలో మార్క్సిజం ఒక శక్తిగా వుంది. సోవియట్ యూనియనూ, దాని వాగ్దానాలు కార్మికులలో, పేదలలో అనేక ఆశలను-అవి ఆధారరహితమైనవను కోండి-కల్పించాయి. అమెరికాలో విప్లవంరాగల అవకాశంతో పాలకవర్గం మెత్తబడింది. అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ పెట్టుబడిదారీ విధానపు సంక్షోభం అవతల పడవేసిన వారికి సామాజిక భద్రతా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాడు... కనుక ఎంతో కొంతమేరకు సామాజిక భద్రతను ఉంచాలన్న అంశాన్ని గుర్తించి రిపబ్లికన్లు పట్టు విడవాలి".

కా॥ లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంలో సోవియటు యూనియన్, కా॥ మావో, చౌఎన్‌లైల నాయకత్వంలో నవచైనాలు సోషలిస్టు సమాజ నిర్మాణానికి పూనుకున్నాయి. అనతి కాలంలోనే ఆకలి, నిరుద్యోగాలను రూపుమాపాయి. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంగా ఉన్నత సోషలిస్టు వ్యవస్థను ప్రపంచ ప్రజల ముందుంచాయి. దీనితో ప్రపంచ కార్మిక వర్గ తిరుగుబాట్లు చెలరేగుతుందన్న భయంతో బూర్జువా వర్గం "సంక్షేమ రాజ్య" మన్న నినాదాన్ని ముందుకు తెచ్చింది. కార్మిక వర్గంలో పెల్లుబుకుతున్న అశాంతి, తిరుగుబాట్లను చల్లార్చేందుకు నిరుద్యోగ భృతి వంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాయి. తమ దోపిడీ, అణచివేత పాలనను కాపాడుకునేందుకు అమెరికా, యూరపు బూర్జువా వర్గాలు ఈ విధానాన్ని అనుసరించాయి.

ఆధునిక రివిజనిజం సోషలిస్టు నిర్మాణానికి తూట్లు పొడవటంతో బూర్జువా వర్గం వూపిరి పీల్చుకుంది. రష్యా చైనాలో పెట్టుబడిదారీ విధానం పైచేయి పొందటంతో అవి ధైర్యాన్ని తెచ్చుకున్నాయి. అది కమ్యూనిస్టు సిద్ధాంతంపై, సోషలిస్టు వ్యవస్థపై నిందాదాడులు సాగించాయి. కార్మికవర్గం, శ్రామిక ప్రజలు పోరాడి సాధించుకున్న అన్ని హక్కులనూకాలరాయటానికి పూనుకున్నాయి. దీనిలో భాగమే నేడు అమెరికాలోనూ, యూరపులోనూ, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలోనూ శ్రామిక ప్రజలపైనా వారి హక్కులపైనా దాడులు సాగిస్తున్నాయి.

ప్రపంచ కార్మికవర్గమూ శ్రామిక జనావళి దీనిని ప్రతిఘటిస్తాయి. సోషలిజం కొరకు తమ పోరాటాన్ని తీవ్రం చేస్తాయి. ✤

# సామ్రాజ్యవాద దేశాల అణ్వస్త్ర తయారీలో 'ప్లూటోనియం' అవసరాల కోసమే మన దేశంలో పెద్దఎత్తున సాగుతున్న యురేనియం నిక్షేపాల వెలికితీత

**మనదేశంలో**-ముఖ్యంగా మన రాష్ట్రంలోనూ యురేనియం నిక్షేపాలు అధికంగా వున్నాయని తమ పరిశోధనలో వెల్లడైందని 'యురేనియం కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' (యుసిఐఎల్) ప్రకటించింది. ప్రధానంగా అణువిద్యుత్ కేంద్రాలలోనూ, అణ్వస్త్ర ప్రయోగాలలోనూ అవసరమయ్యే యురేనియం నిక్షేపాల పరిశోధన, వాటి వెలికితీత వంటి కర్తవ్యాల నిర్వహణ కోసం న్యూ క్లియర్ పవర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్)కు అనుబంధంగా యుసిఐఎల్ తన కార్యక్రమాలు కొనసాగిస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక యురేనియం నిక్షేపాలున్న ప్రాంతాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 20వ స్థానంలో వుందనీ, ప్రస్తుతం దేశంలో 1.41 లక్షల టన్నుల యురేనియం నిల్వలున్నాయని అంచనా వేస్తుండగా ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 60 వేల టన్నులపైగా యురేనియం నిక్షేపాలున్నట్లుగా యుసిఐఎల్ ప్రకటించింది.

కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా గోగిలో 4వేల టన్నుల యురేనియం నిక్షేపాలను కనుగొన్నారు. రాజస్థాన్ రాష్ట్రం, సికార్ జిల్లా రోహిలి ప్రాంతంలో ప్రభుత్వం 5 వేల నుండి 10 వేల టన్నుల యురేనియం నిక్షేపాలను వెలికి తీసే ప్రయత్నాలలో వుంది. మేఘాలయలో పెద్దఎత్తున యురేనియం నిక్షేపాలను గుర్తించి వాటిని వెలికి తీసేందుకు 2009లోనే యుసిఐఎల్‌కు ప్రభుత్వం అనుమతినిచ్చింది. విద్యార్థుల, ప్రజాహక్కుల సంఘాల, మేధావుల నిరసనలను తోసిపుచ్చి అక్కడ యురేనియం తవ్వకాలు సాగుతున్నాయి. ఇంకా ఝూర్ఖండ్‌లో 48 వేల టన్నుల యురేనియం నిల్వలున్నట్లుగా గుర్తించింది.

రాష్ట్రంలో వున్న యురేనియం నిల్వలలో అత్యధికం, రాయలసీమ జిల్లాలలోనూ-ముఖ్యంగా కడప జిల్లాలోనూ వున్నట్లుగా గుర్తించారు. అలాగే నల్గొండ జిల్లా పరిధిలోని మరికొన్ని ప్రాంతాలలోనూ యురేనియం నిల్వలున్నాయి.

దీనితో సహజంగానే సామ్రాజ్యవాద దేశాల ముఖ్యంగా అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలకన్ను ఈ యురేనియం నిల్వలపై పడింది. వివిధ సామ్రాజ్యవాద దేశాల్లో అణువిద్యుత్ కర్మాగారాల భద్రత, నిర్వహణలపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకతల కారణంగా ఆయా దేశాలలో అణువిద్యుత్ కేంద్రాలను మూతవేస్తూ, వారు తొలగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రమాదకర పరికరాలను మనకు కట్టబెడుతున్నారు. పైగా 'ఉదారంగా' మన దేశానికి సహాయం చేస్తున్నట్లుగా పోజుపెడుతున్నారు. ఈ క్రమంలో మన దేశంలో అణు విద్యుత్ కేంద్రాల ప్రతిపాదనలు, అణువిద్యుత్ కేంద్ర నిర్మాణ ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. ఈ అణువిద్యుత్ కేంద్రాలలో యురేనియం పరమాణు విచ్ఛిత్తి ఫలితంగా విద్యుదుత్పత్తితో పాటు లభించే ప్లుటోనియం వంటి ఉప ఉత్పత్తులను సామ్రాజ్యవాదులు తమ దేశాలకు తరలించుకెళ్ళి, అణ్వస్త్ర తయారీలో వినియోగించుకునేందుకూ పథకాలను రచించి అమలు చేస్తున్నారు. ఈ విధంగా కాలం చెల్లిన తమ యంత్రాలను అధిక ధరకు విక్రయించటంతో పాటుగా, తమకు అవసరమైన ప్లుటోనియంను తరలించుకెళ్ళే ప్రయత్నాలలో వున్నారు. మన దేశంలో యురేనియం నిల్వలను వెలికి తీసేందుకు, వాటిపై ఆధారపడిన అణువిద్యుత్ కేంద్రాలను స్థాపించేందుకు సామ్రాజ్యవాద దేశాల తాపత్రయం వెనుకనున్న పరమార్థమిదే!

మరో 11 సం॥ల కాలంలో తమ దేశంలోని అణువిద్యుత్ కేంద్రాలను మూసివేయాలని జర్మనీ భావిస్తున్నది. మే 29వ తేదీ రాత్రి జర్మనీ ఛాన్సలర్ అధ్యక్షతన తెల్లవార్లూ సుదీర్ఘంగా సాగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జపాన్-పుకిషిమా అణుప్రమాదాల నేపథ్యంలో దేశంలో వ్యక్తమైన ప్రజావ్యతిరేకత కారణంగా ఈ ప్రకటన వెలువడింది. ఏమైనా, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగివున్న దేశాలే తమ దేశాల్లో అణువిద్యుత్ కేంద్రాలన్నింటినీ మూసివేస్తామని ప్రకటిస్తూవుంటే, అరువు తెచ్చుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో మన దేశంలో అణువిద్యుత్ కేంద్రాల స్థాపనకు పాలకులు తెగ ఉబలాటపడటమనేది-సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ఊడిగంచేసే వారి దళారీ స్వభావాన్నే వెల్లడి చేస్తున్నది.

2006లో కడప జిల్లా వేములవాడ మండలం, ఎం. తుమ్మలపల్లె ప్రాంతంలో 1106 కోట్ల అంచనా వ్యయంతో యుసిఐఎల్ ఆధ్వర్యంలో యురేనియం తవ్వకాలు, యురేనియం ప్రాజెక్టు పనులు ప్రారంభించి కొనసాగిస్తున్నారు. తవ్వకాలు, ప్రాజెక్టు అవసరాల పేరిట తుమ్మలపల్లె, రాచకుంటపల్లె, మబ్బు చింతపల్లె గ్రామాలకు చెందిన రైతుల నుండి భూసేకరణ చట్టాన్ని ఉపయోగించి ప్రభుత్వం 1100 ఎకరాల భూములను గుంజుకొన్నది. ఈ భూములన్నీ అరటి, వేరుశనగ, ఉల్లి, మిర్చి, కంది తదితర పంటలు పండించే సాగు భూములే! నీటిపారుదల సౌకర్యం వుండి భూమి కోల్పోయిన వారికి ఎకరాకు లక్షా 80 వేల రూపాయలు; వర్షాధారంతో సాగయ్యే భూములు కోల్పోయినవారికి ఎకరాకు లక్షా 20 వేల రూపాయలు చొప్పున మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారంగా ముట్టజెప్పింది. షరా మామూలు గానే ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన ప్రతి కుటుంబంలోనూ ఒకరికి తప్పనిసరిగా ఉద్యోగావకాశం కల్పిస్తామనే హామీలు గుప్పించారు, యధావిధిగా తదనంతర కాలంలో వాటన్నింటినీ తుంగలో తొక్కారు.

యురేనియం తవ్వకాలకోసం సేకరించిన భూములలో 25 ఎకరాల పరిధిలో ఇప్పటివరకు షుమారు 700 అడుగుల లోతుకు, భూగర్భంలో కిలోమీటరు మేర తవ్వకాలు జరిపి ముడి యురేనియంను వెలికి తీస్తున్నారు. ఈ తవ్వకాలు సాగించే ప్రదేశానికి 5.5 కిలోమీటర్ల దూరంలోని భూమయ్యగారిపల్లె నాణ్యమైన అరటిపంటకు ప్రసిద్ధిగాంచింది. యురేనియం తవ్వకాలు భూమిలో లోతుకు సాగిన కొలదీ ఈ ప్రాంతంలో ఇప్పటికి 150 బోరు బావులలో నీరు అడుగంటి పోయింది. భూగర్భం ఎండుక పోతోంది. 800 ఎకరాల్లో కోతకు వచ్చిన అరటి పంటకు తీవ్ర నీటి కొరత ఏర్పడింది. గతంలో 80 అడుగుల లోతులోనే బోరు బావుల్లో నీరుపడేది. కానీ ప్రస్తుతం 1000 అడుగులు తవ్వుతున్నా చుక్కనీరు పడటంలేదు. యురేనియం తవ్వకాలు లోతుకు వెళ్ళిన కొలదీ బ్లాస్టింగ్‌కు వాడే రసాయనాలు, ఆయిల్ తదితరాల కారణంగా పరిసర భూమయ్యగారిపల్లె, కోట తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమౌతున్నాయి. వంట పాత్రలు సైతం చిల్లులు పడుతున్నాయి. యురేనియం ప్లాంటులో ముడిఖనిజం శుభ్రపరిచే ప్రక్రియలోనూ, ఇతర సాంకేతిక అవసరాల కోసమూ వాడే నీరు, ఇతర వ్యర్థ పదార్థాలతో కలసి పైపుల ద్వారా తరలించే సందర్భంగా ఏర్పడే లీకేజీల ఫలితంగా తాగునీరు కలుషితమౌతున్నది.

(తరువాయి 4వ పేజీలో)

# మత్స్యకారుల సమస్యలను తీవ్రం చేస్తున్న పాలకుల విధానాలు

**మన** రాష్ట్ర తీర ప్రాంతంలో సముద్రంపై ఆధారపడి 60 లక్షల మందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. దోపిడీ వర్గాలకు సేవచేసే భారత దళారీ పాలకుల పాలనలో సముద్రంపై ఆధారపడిన వీరి జీవనమూ అత్యంత సంక్షోభాన్నెదుర్కొంటున్నది.

మన దేశానికి మూడుదిక్కులా విస్తరించి వున్న విశాలమైన, సంపద్వంతమైన తీర ప్రాంతంలో సామ్రాజ్యవాదుల లూటీ సాగుతున్నది. భారతపాలకుల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో, తీరం వెంట వారి దురాక్రమణ వేగవంతమైంది. దీనిలో భాగంగా తీరంనుండి భూతలం దిశగా 500 మీటర్ల వరకూ శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండా నిరోధించే 'కోస్టల్ రెగ్యులేటరీ జోన్' చట్టాన్ని వివిధ పద్ధతుల్లో క్రమక్రమంగా నీరుగార్చారు. (వివరాలకు 5-6-2010, జనశక్తి)

## వ్యూహాత్మక తీరప్రాంతంపై సామ్రాజ్యవాదుల దేగకన్ను

2009లో 'సముద్ర చేపలవేట (నియంత్రణ-నిర్వహణ)' పేరిట నూతన చట్టంచేసి మత్స్యకారుల జీవనాన్ని పాలకులు మరింతగా చిక్కుల్లో పడవేశారు. సాధారణ మత్స్యకారులకు చేపల వేటను పెనుభారంగా మార్చివేసి ఆధునిక బడా, కార్పొరేటు సంస్థలు మన తీరంలోని మత్స్య సంపదనంతా ఊడ్చుకెళ్ళేందుకు వరద గేట్లు తెరిచారు. మరోవైపున తీరప్రాంతంలో పాటించ వలసిన కనీస నిబంధనలను గాలికొదిలి, సామ్రాజ్యవాద బహుళజాతి పరిశ్రమలకు, బడా కార్పొరేటు కంపెనీలకు తీరప్రాంతాన్ని ముక్కలు ముక్కలుగా విభజించి మొత్తంగా కట్టబెడుతున్నారు. ప్రమాదకరమైన రసాయన, అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల వంటి పరిశ్రమల స్థాపనకు ఆఘమేఘాలమీద అనుమతులను అందజేస్తున్నారు. తీరంలో తమ ఉనికినే ప్రశ్నార్థకం చేసే పాలక ప్రభుత్వాల విధానాలకు, చర్యలకు వ్యతిరేకంగా మత్స్యకారులు, తీరప్రాంత రైతులు, కూలీలు, చేతి వృత్తులవారు, గ్రామీణ పేదలు, ఉప్పురైతులు తదితర ప్రజానీకమంతా వివిధ రూపాల్లో ఆందోళనలు ఉద్యమాలు చేపడుతున్నారు. ఆందోళనలు, సాగిస్తున్న ఈ ప్రజానీకంపై, రైతాంగంపై పాలకులు కాల్పులు జరిపి ప్రాణాలను బలితీసుకో వటానికి కూడా వెనుకాడరని ఇటీవల సంఘటనలు మరోమారు స్పష్టం చేస్తున్నాయి.

కాగా, 2008 నవంబరులో బొంబాయిలో జరిగిన తీవ్రవాదుల దాడుల నేపథ్యంలో, పాకిస్తాన్ తీవ్రవాదులు నావికా మార్గంద్వారా, సముద్రంగుండా మన దేశంలో ప్రవేశించారనే పేరిట, తీర ప్రాంత భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలనే పేరిట, 'కోస్టల్‌గార్డ్స్' అనే పోలీసు బలగాల మోహరింపును తీరప్రాంతంలో తీవ్రం చేస్తున్నారు. వాస్తవానికి ఉగ్రవాదుల ప్రవేశాన్ని నిరోధించటమనే పేరిట రానున్న కాలంలో తీర ప్రాంతంలో మరింత ఉధృతం కానున్న ప్రజా ఆందోళనలను కాలరాచివేయటానికే కుట్రపూరితంగా ఈ కోస్టల్ గార్డ్స్, మెరైన్ పోలీస్ వ్యవస్థలను పకడ్బందీగా రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంనుండీ ఇటీవల కాలంలో ప్రభుత్వాలు, మత్స్యశాఖ అధికారులు చేపట్టిన చర్యలను పరిశీలించాలి.

## విదేశీ ట్రాలర్లకు మార్గం సుగమం- దేశీయ మత్స్యకారులపై ఆంక్షలు అధికం

మన రాష్ట్రతీరంలో చేపల వేటకు వెళ్ళే మెకనైజ్‌డ్ బోట్లన్నింటికీ ఒకే విధంగా -పసుపుపచ్చ రంగును వేయాలని-రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ ఉత్తర్వు జారీ చేసింది. దేశ తీర ప్రాంతంలోని ఒక్కో రాష్ట్రం తమ పరిధిలోని బోట్లకు ఒకే విధమైన రంగు వేయాలని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తీరప్రాంత గస్తీ విభాగం (కోస్టల్‌గార్డ్స్) సూచనలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులనిచ్చింది.

2011 మే 31 నుండి ఈ ఉత్తర్వులు అమలు చేస్తామనీ, ఏ బోట్లు అయితే ఈ ఆదేశాలు పాటించవో వాటికి డీజిల్ సబ్సిడీ రద్దు చేయటంతో పాటుగా, లైసెన్సులు పునరుద్ధరించబడవని ప్రకటించారు. ప్రభుత్వం ఆదేశించిన విధంగా రంగులు వేయటానికి ఒక్కో బోటుకు రూ. 40 వేల దాకా ఖర్చు అవుతుందని, ఇంత ఖర్చును తాము భరించగలిగే పరిస్థితిలోలేమని ఏ.పి. మెకనైజ్‌డ్ ఫిషింగ్‌బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ తమ ఇబ్బందులను తెలియజేసింది.

అంతేగాక సాంస్కృతికంగా విద్యాపరంగా వెనుకబడిన మత్స్యకారులుగా తమ ఆచార సంప్రదాయాలు, నమ్మకాలు - కట్టుబాట్లు తమ కుంటాయని, దాని ప్రకారం బోటుకు వుంచే దేవతపేరు కనుగుణమైన రంగునే బోటుకు వేసుకుంటామని, ఈ విశ్వాసాలను ఇప్పటికిప్పుడు మార్చుకునేందుకు మత్స్యకారులు సిద్ధంగా లేరని కూడా మత్స్యకారుల సంఘం ప్రకటించింది. ఏ రాష్ట్రం బోటు ఏదో గుర్తు పట్టడం కోసమే బోట్లకు కొత్తగా ఈ రంగులద్దే కార్యక్రమమైతే, బోటు కిరువైపులా ఒక్కో రాష్ట్రానికి చెందిన ప్రత్యేక చిహ్నాలను (లోగోలను) గుర్తించదగిన మోతాదులో ముద్రించవచ్చునని వారు ప్రత్యామ్నాయా లనూ సూచించారు. రంగులనుబట్టి చొరబాటుదారులను నిరోధించటమనేది అసాధ్యమని, తమ బోటుకు పసుపురంగు వేసుకోవటమనేది చొరబాటుదారులకు తెలీని విషయం కూడా కాదని వారు వ్యాఖ్యానించారు. 'రంగు' విషయమై మత్స్యకారులను వేధింపులకు గురిచేయటాన్ని ఆపివేయాలని, విశాఖపట్నం నుండి గంగవరం పోర్టు పరిధిలోని 274 చదరపు కిలోమీటర్ల పరిధిలో చేపలవేటను నిషేధించే జీ.వో. నెం. 7ను రద్దు చేయాలని వారు డిమాండు చేశారు.

2009లో రూపొందించిన సముద్రంలో చేపల వేట (నియంత్రణ-నిర్వహణ) చట్టం అమలు తర్వాత మనదేశ సముద్ర జలాల్లో విదేశీ ట్రాలర్లు చేపల వేట సాగించేందుకు ప్రభుత్వం అనుమతులివ్వటం జోరందుకుంది. మన దేశీయ తీరప్రాంత మత్స్యకారుల తీవ్రనిరసనల ఫలితంగా ప్రభుత్వం ఏర్పరచిన మురారి కమిటీ విదేశీ ట్రాలర్లకు మనదేశ సముద్రజలాల్లో చేపలవేటకు అనుమతి నివ్వటాన్ని ఆపివేయాలని సిఫార్స్ చేసింది. ఆందోళనాకారుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు కమిటీలు వేయటం, వాటి సిఫార్సులు ఏ విధంగా వున్నప్పటికీ తామనుకున్న విధంగా అమలు చేసుకుంటూ పోవటం పాలకులకు వెన్నతో పెట్టిన విద్యే! కనుక, విదేశీట్రాలర్లకు అనుమతులు ఆగకపోగా, పైచట్టం యొక్క దన్నుతో మరింత తీవ్రమయ్యాయి. ఒక అనుమతి పత్రంతో (లెటర్ ఆఫ్ పర్మిషన్) నాలుగు లేదా ఐదు విదేశీ ట్రాలర్లు నిరంతరాయంగా భారత సముద్ర తీరంలోని మత్స్య సంపదను ఊడ్చుకెళ్తూవున్నా పాలకులకు, అధికారులకు చీమకుట్టినట్లయినా వుండటం లేదు. గత రెండేళ్ళలో కేంద్ర ప్రభుత్వం 125 విదేశీ ట్రాలర్లకు అనుమతి పత్రాలనిచ్చింది.

ప్రతియేటా ఏప్రిల్ 15 నుండి మే 31 వరకు 47 రోజుల పాటు దేశంలోని తూర్పు తీర సముద్రంలో చేపలవేటను మత్స్యకారులు స్వచ్ఛందంగా ఆపివేస్తారు. జూన్ 15 నుండి జులై 31 దాకా దేశ పశ్చిమతీరంలోని అరేబియా సముద్రంలో కూడా చేపల వేటను ఆపివేస్తారు. మత్స్య సంపద వృద్ధి కొరకు మత్స్యకారులు అనూచానంగా, స్వచ్ఛందంగా పాటిస్తూ వస్తున్న నిషేధాన్నే కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం ద్వారా అమలుకు పూనుకుంది. సాంప్రదాయక మత్స్యకారులు యథాప్రకారం ఈ ఉత్తర్వులను పాటిస్తుండగా, విదేశీ ట్రాలర్లు ఈ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఇదే అదనుగా విచ్చలవిడిగా చేపలవేటను కొనసాగిస్తున్నా పాలకులకేమీ పట్టడంలేదు.

అంతేగాక, ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న విదేశీ ట్రాలర్లు సముద్రగర్భంలో సమూహాలుగా కదులుతున్న చేపల వద్దకు నేరుగా వలలు వేయగలుగు తున్నాయి. అత్యాధునిక వలలనుపయోగించి అతి తక్కువ సమయంలో అధిక మొత్తంలో చేపలను, రొయ్యలను ఇతర సముద్ర సంపదనుపట్టి తరలించు కెళ్తున్నాయి. ఈ విధంగా గ్రుడ్లు, పిల్లతో సహా సమస్తాన్నీ ఊడ్చుకెళ్తూ, సముద్ర సంపదను పదికాలాలపాటు పరిరక్షించకుండా నిలువుదోపిడీ సాగిస్తున్నాయి. సామ్రాజ్యవాద, బడా కార్పొరేటు సంస్థల దుర్మార్గాన్ని అరికట్టకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుండి పోవటంతో మన దేశీయ బోట్లకు, సాంప్రదాయక మత్స్య కారులకు చేపలవేట లాటరీగా మారిపోయింది. మరోవైపున నదులు సముద్రాలతో కలిసే ముఖద్వారాల వద్ద ఇసుక మేటలు వేయబడి మన దేశీయబోట్లు సముద్రంలో వేటకు వెళ్ళి రావటానికి తీవ్ర అవరోధాలుగా నిలుస్తున్నా, డ్రెడ్జర్ల ద్వారా ఆ ఇసుక మేటలను తొలగించే చర్యలకు పూనుకోకపోవటం మత్సకారులకు మరింత నష్టాన్ని మిగులుస్తున్నది.

తీరప్రాంతంలో సాంప్రదాయకంగా చేపలవేట సాగించే మత్స్యకారులు సాగించిన అనేకానేక ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం కంటితుడుపుగానైనా వారికి కొన్ని రాయితీలను ప్రకటించింది. మత్స్యకారులు చేపలవేటకు ఉపయోగించే బోట్లకు అవసరమైన డీజిల్‌పై నామమాత్రమైన సబ్సిడీకి అంగీకరించింది. నెలకు ఒక్కోబోటుకు వేలాది లీటర్ల డీజిలు ఖర్చయినా ప్రభుత్వం కేవలం 3వేల లీటర్లకు మాత్రమే లీటరుకు 6 రూ॥ చొప్పున సబ్సిడీ చెల్లిస్తానని ప్రకటించింది. (ఆచరణలో దీనిని కూడా నాలుగు రూపాయలకే దిగకోసింది) ఈ మేరకు కూడా నిర్ణయించిన విధంగా మత్స్యకారులకు డీజిలు సబ్సిడీని సకాలంలో అందివ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నది. డీజిలు సబ్సిడీ బకాయిలు ఇప్పటికి 26 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. పలుదఫాలుగా పెరుగుతున్న డీజిలు ధరలతో ప్రభుత్వ మిచ్చే సబ్సిడీ ఎందుకూ కొరగానిదిగా మారిపోయాయి మత్స్యకారుల చేపల వేట ఖర్చులు విపరీతంగా పెరిగిపోయి. పైన పేర్కొన్న వివిధ కారణాలతో చేపలు సరిగా లభించక, వేటకు వెళ్ళి వచ్చేందుకు పెట్టే కనీస ఖర్చులు కూడా రాక ఒక్క విశాఖ ప్రాంతంలోనే 25 మంది బోట్ల యజమానులు ఈమధ్య కాలంలోనే తమ బోట్లను అమ్మివేసుకున్నారు. మరో 50 మంది తమ బోట్ల అమ్మకానికి సిద్ధంగా బేరంపెట్టారు.

## కాలుష్యపు విషకౌగిలిలో తీరం

రాష్ట్రంలోని తీరప్రాంతం కాలుష్యపు కోరల్లో చిక్కుకుపోతున్న ఫలితంగా చేపలు, రొయ్యలు, సముద్రపు తాబేళ్ళవంటి వివిధ రకాల సముద్ర జీవులు క్రమంగా తరిగి పోతుండటాన్ని వివిధ అధ్యయనాలు వెల్లడి చేస్తున్నాయి. మత్స్యకారులు ప్రత్యక్షంగా తమ జీవితానుభవంలోనూ గమనిస్తున్న విషయమే. ఇది మన రాష్ట్రంలోని తీరప్రాంతంలోనే 63 థర్మల్, అణువిద్యుత్ కేంద్ర నిర్మాణాల ప్రతిపాదనలున్నాయి. ఇందులో కొన్ని అనుమతులన్నింటినీ పూర్తి చేసుకొని నిర్మాణ దశలో ఉండగా మరికొన్ని భూమి సేకరణ దశలో ఉన్నాయి. కాలుష్యపుకోరలతో కబళించి తమ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్న ఈ ప్రమాదకర పరిశ్రమల నిర్మాణానికి వ్యతిరేకంగా తీరప్రాంత వాసులు ఉద్యమ బాటలో సాగుతున్నారు.

ఒకవైపున తీరప్రాంతాన్ని కాలుష్యపు విషకౌగిలిలోకి నెట్టివేస్తున్న సామ్రాజ్యవాదులు ముఖ్యంగా వారి నాయకుడైన అమెరికా తన ఆర్థిక అంగమైన ప్రపంచ బ్యాంకు ద్వారా కోస్తా తీరప్రాంత రక్షణ, అభివృద్ధిల పేరిట 771 కోట్ల వడ్డీ రహిత ఆర్థిక సహాయమందించ టానికి పూనుకోవటం, వారి దుష్టపథకాల పనితీరును పరిశీలిస్తున్న వారికెవరికీ ఆశ్చర్యం కలిగించదు. రోడ్లు, బ్రిడ్జీలు, తుపానుషెల్టర్ల నిర్మాణం పేరిట రానున్న కాలంలో తీర ప్రాంతంలో తమకవసరమైన మౌలిక సదుపాయాలను మన డబ్బులతో తామే నిర్మించుకొని తిరిగి మనకే ఉదారంగా సహాయం చేసినట్లుగా ఫోజు పెట్టుకోవటం సామ్రాజ్య వాదులకే చెల్లింది! ఈ పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన 2015 నాటికి పూర్తి చేస్తామని మన దేశంలో కొలువైన ప్రపంచబ్యాంకు మౌలిక సదుపాయాలనిపుణుడు ఎన్.వి.రాఘవ ప్రకటిస్తున్నాడు.

## తీరప్రాంత రక్షణ పేరిట పోలీసు బలగాల మోహరింపు

ఇక, తీర ప్రాంత రక్షణ కోసమంటూ కోస్టల్‌గార్డ్సను గస్తీదళాల పేరిట చెదురుమదురుగా ఏర్పటుచేసిన స్థితి నుండీ నావికాబలగాలకు సమాంతరంగా పాలకులు తీరప్రాంత రక్షణ బలగాల వ్యవస్థను తీర్చిదిద్దుతున్నారు. తీరప్రాంతంలో అక్కడక్కడా మెరైన్‌పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసి క్రమంగా వాటిని రాష్ట్ర, కేంద్రస్థాయిల్లో వ్యవస్థీకృతం చేస్తున్నారు. మనరాష్ట్రంలో ఇప్పటికే తీరప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెరైన్ పోలీస్ స్టేషన్లను తమిళనాడు రాష్ట్రంలో కోస్టల్ సెక్యూరిటీ స్కీం తరహాలో ప్రత్యేక వ్యవస్థగా ఇటీవలే ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, కళింగపట్నం, రుషికొండ, వకలపూడి, మెరైన్ పోలీస్ స్టేషన్లను ఉత్తర మండలం పరిధిగానూ; గిలకలదిండి (కృష్ణాజిల్లా), సూర్యలంక (గుంటూరు జిల్లా), దుగ్గరాజుపట్నం (నెల్లూరు జిల్లా) మెరైన్ పోలీస్ స్టేషన్లను దక్షిణ మండలం పరిధిగానూ విభజించారు. మొత్తంగా ఈ తీర ప్రాంత మెరైన్ స్టేషన్‌లన్నీ విశాఖపట్నం కేంద్రంగా ఐ.జి. స్థాయి పోలీసు అధికారి నేతృత్వంలో తమ కార్యక్రమాలు నిర్వహిస్తాయి. పైన పేర్కొన్న విధంగా తీరప్రాంతంలో వివిధ రూపాల్లో వ్యవస్థీకృత మౌతున్న పోలీసు బలగాలు ఉగ్రవాదుల దాడులను మట్టు బెట్టటానికేమాత్రం కానేకాదనీ అంతిమంగా ఈ బలగాలన్నీ పోరుబాటలో సాగుతున్న తీర ప్రాంత ఉద్యమాల అణచివేతకుద్దేశించినవేనని తీర ప్రాంత వాసులు తమ అనుభవాలనుండి కూడా క్రమంగా గ్రహిస్తున్నారు. పోరుబాటలో ఐక్యంగా ఉద్యమించటం మినహా మరో మార్గం లేదని ముందుకు సాగుతున్నారు.

✤

---

**సామ్రాజ్యవాద...** (3వ పేజీ తరువాయి)

షుమారు 80 కిలోమీటర్ల దూరం సొరంగమార్గం ద్వారా వ్యర్థ పదార్థాలు తరలించి, సోములవారిపల్లె డంప్ చేయటంతో, ఆ కాలుష్య ప్రభావానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు. ఇప్పటికే చాలామంది విరేచనాలు, చర్మరోగాల వంటి వ్యాధులతో బాధపడు తున్నారు.

గత 3 సంవత్సరాలుగా ప్రారంభమైన యురేనియం తవ్వకాలతో ప్రజలు ప్రత్యక్షంగా అణుధార్మికత కారణంగా తీవ్ర సమస్యలను ఒక వైపున ఎదుర్కొంటూవుంటే, దీనినేమీ ఖాతరు చేయకుండా ప్రభుత్వం 25 కోట్ల వ్యయంతో యురేనియం తవ్వకాల రెండోదశను ప్రారంభించేందుకు సిద్ధమైంది. తమ స్వీయ అనుభవాల నుండి కూడా ప్రజలు యురేనియం ప్లాంటు విస్తరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాను చేబట్టబోయే చర్యకు ఆమోదముద్ర వేయించుకునే దానిలో భాగంగా జూన్ 5వ తేదీన తూతూ మంత్రంగా ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను పరిసర గ్రామాల ప్రజలు అడ్డుకొని తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు.

నల్గొండజిల్లా పెదగుట్ట ప్రాంతంలోనూ యురేనియం నిక్షేపాలను గుర్తించిన ప్రభుత్వం తవ్వకాలకు రంగం సిద్ధం చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు పర్యావరణానికీ, తమ ఆరోగ్యాలకీ, జీవనానికీ ప్రమాదకరమైన యురేనియం తవ్వకాల ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. కొండుబీముని పల్లె గిరిజన నగర్‌లో యురేనియం నిక్షేపాల వెలికితీత పనుల్లో భాగంగా మార్చి 3న సర్వే చేయటానికి ప్రయత్నించిన ప్రభుత్వ అధికారులను ప్రజలు అడ్డుకొన్నారు. దేవరకొండ-మహబూబ్‌నగర్ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళన ఫలితంగా అధికారులు తమ సర్వే పనులను కట్టిపెట్టి వెనక్కు మళ్ళారు. కావున, దేశ-ప్రజల అవసరాలతో నిమిత్తం లేని ఖనిజాల వెలికితీతలన్నింటినీ నిలిపి వేయాలని ఉద్యమించాలి.

✤


చదవండి!



అరబ్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు
సామ్రాజ్యవాదుల కుట్రలు

వెల : 15/-

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

కాంతి కేంద్రాలా!
మృత్యు మందిరాలా ?

పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర,
సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-

మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
ఏలూరురోడ్, విజయవాడ

# బాలకార్మికుల శ్రమతో వర్ధిల్లుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం

**సంవత్సరం** పొడుగునా ప్రతిరోజూ ఏదో ఒక 'దినాన్ని' ప్రభుత్వాలు జరుపుతూఉంటాయి. ఐక్యరాజ్య సమితి, దాని అనుబంధ సంస్థలు అటువంటి 'దినా'లను జరపటాన్ని ప్రోత్సహిస్తూ ఉంటాయి.

జూన్ 12–బాలకార్మికులకు సంబంధించి అటువంటి దినం! బాలకార్మిక దినాన్ని అభివృద్ధి చెందిన దేశాలు పాటిస్తూంటాయి. వాటిని వర్ధమానదేశాలు అనుసరిస్తూ ఉంటాయి. ప్రపంచంలో బాలాకార్మిక వ్యవస్థను అంతం చేస్తామనే భీషణ ప్రతిజ్ఞలతో, ప్రకటనలతో పెద్దఎత్తున బాలకార్మిక దినోత్సవాలు జరుగుతూ ఉంటాయి.

ప్రపంచవ్యాపితంగా 21.5 కోట్ల మంది బాల కార్మికులు దుర్భర పరిస్థితులలో పనిచేస్తున్నారనేది ఒక చేదు వాస్తవం. అమెరికన్ సామ్రాజ్యవాద నిర్దేశకత్వంలో, వివిధ పెట్టుబడిదారీ ప్రభుత్వాలు, ఐక్యరాజ్యసమితి, బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాలు జరపటమే ఎంతో మోసపూరితం. ప్రపంచ పీడిత ప్రజలు ఎటువంటి మానవతా విలువలు లేని, శ్రమదోపిడీతో కూడిన నయా ఉదారవాద విధానాల చేదుగుళికను మింగటానికి సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం అటువంటి ఉత్పాదనలను గొప్ప నటానాకౌశలంతో జరుపుతూ ఉంటాయి.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, మానవ హక్కులను ప్రపంచంలో నిలబెట్టే మొనగాడుగా అమెరికా సామ్రాజ్యవాదం సిగ్గులేకుండా ధైర్యంగా తనకు తానుగా ప్రకటించుకొంటున్నది. ఈ భూగోళం మీద మానవ హక్కుల రక్షకుడిగా భావిస్తోంది. వివిధ దేశాల సార్వభౌమత్వాన్ని హరిస్తూ, తన ప్రస్థానంలో అన్ని అంతర్జాతీయ చట్టాలనూ ఉల్లంఘిస్తూ, యుద్ధాలుచేస్తున్న అమెరికా, ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను స్థాపించటానికే ఇదంతా చేస్తున్నానని చెప్పుకొంటోంది.

ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుతున్నామంటూ అమెరికా చెప్పుకొనే గొప్పలను ప్రక్కన బెట్టి ఆలోచిస్తే కనిపించే వాస్తవమేమిటంటే అది మానవ హక్కులను, కనీసం బాలలహక్కులను కూడ గౌరవించటం లేదు. అమెరికాలో ఉన్న బాల కార్మిక వ్యవస్థ అమెరికా యొక్క ద్వంద్వ నీతికి, మోసకారితనానికి ఋజువు. పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన ఐరోపాలో ముఖ్యంగా తూర్పు ఐరోపాలో కూడా బాల కార్మిక వ్యవస్థ ఉన్నది.

ఆసియా పసిఫిక్ దేశాలలో కార్మికుల మొత్తం సంఖ్యలో బాలకార్మికులు 41% ఉండగా, ఆఫ్రికాలో 33%, లాటిన్ అమెరికా దేశాలలో 8% ఉన్నారు. పెట్టుబడిదారీ దేశాలతో సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బాలకార్మిక వ్యవస్థ–అమెరికా సామ్రాజ్యవాదమూ దానిని బలపరిచే దేశాలు అంతర్జాతీయ ప్రకటనలను, ఒప్పందాలను, తీర్మానాలను, జాతీయ సంస్థలను, రాజ్యాంగాలను ఏ విధంగా ఉల్లంఘిస్తున్నదో ఋజువు చేస్తున్నది.

ప్రపంచ పెట్టుబడి తన లాభాల కోసం ఉద్దేశ్య పూర్వకంగానే, చౌకగా లభించే బాలకార్మికులను నియమిస్తున్నది. వీరు కార్మిక సంఘాలు స్థాపించి తమ యజమానులపై ఉద్యమాలు చేయరు. సమ్మెకు దిగరు. నిరసన ప్రదర్శనలు చేయరు. కనుక బాలకార్మికులను నియమించుకొంటున్నారు.

బాలకార్మికులను సంప్రదాయ రంగాలైన వ్యవసాయం, తోటల పెంపకం, బుట్టలల్లడం, చెప్పుల తయారీ వంటి పనులలో పెట్టరు. అనారోగ్యకరమైన, విషపూరితమైన, ప్రమాదకర పరిశ్రమలైన గనులు, రసాయనాలు, నిర్మాణ పరిశ్రమలలో నియమిస్తారు. ప్రజలనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యం, వారి పిల్లలను శారీరక మానసిక ఆరోగ్యం దెబ్బతినే ఇటువంటి పనులలోనికి పంపటానికి కారణమౌతోంది.

మరోవైపున ఈ బాలకార్మిక వ్యవస్థ పెద్దలకు ఉపాధి నిరాకరించే మరో మార్గమవుతుంది. ప్రపంచంలో 21.5 కోట్లమంది బాల కార్మికులుండగా 20 కోట్ల మంది నిరుద్యోగ యువకులున్నారు. నిరుద్యోగులలో చాలామంది బాలకార్మికుల తల్లిదండ్రులేనని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

ప్రపంచంలోని బాలకార్మికులలో అత్యధికులు మన దేశంలో ఉన్నారు. భారతదేశంలో బాలకార్మికుల సంఖ్య 2 కోట్లు ఉంటుందని అధికారిక లెక్కలు చెబుతుండగా, 5 కోట్లకు పైనే నని ఇతర సంస్థలు ప్రకటిస్తున్నాయి. 2/3 వంతు మంది వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలలోను, మిగిలినవారు అసంఘటిత రంగంలోను ఉన్నారు. వ్యభిచారానికి, నగ్న చిత్రాల నిర్మాణానికి కూడా ఉపయోగించుకొంటున్నారు. బాలలలో చాలా మందిని యాచకులుగా, చిన్నచిన్న నేరస్థులుగా మారుస్తున్నారు.

ఈ బాలకార్మిక వ్యవస్థకు మూల కారణం దారిద్ర్యంలో ఉన్నది. దారిద్ర్యాన్ని పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తోంది. పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించకుండా దారిద్ర్యాన్ని నిర్మూలించలేము. కాబట్టి మనం బాలకార్మిక వ్యవస్థనుతొలగించనిదే 'మానవహక్కుల దుర్వినియోగాన్ని తొలగించలేము. మానవజాతి సమస్యలకు పరిష్కారం పెట్టుబడిదారీ విధానం మాత్రమే, దానికి ప్రత్యామ్నాయం లేదు' అని పెట్టుబడిదారీ విధానమే చెప్పుకొంటున్నది. కానీ వాస్తవానికి ప్రపంచ వ్యాపితంగా మానవులపై దౌర్జన్యానికి, దాడులకు మూలకారణం పెట్టుబడిదారీ విధానమే!

"బచ్‌పన్‌బచావో ఆందోళన (బిబిఎ)" అనే బాలల హక్కుల సంస్థ "పెట్టుబడిదారీ అవినీతి, భారతదేశంలో బాలకార్మిక వ్యవస్థ" అను నివేదికను ప్రచురించింది. భారతదేశంలో 6 కోట్ల మంది బాల కార్మికులున్నారని, వారు రోజుకు సగటున 15/– కూలీతో ఏడాదికి 200 రోజులపాటు పనిచేస్తున్నారని ఆ నివేదిక పేర్కొంటున్నది. భారతదేశంలో సగటు వేతనం రు.115/–గా ఉంది. దాని ప్రకారం ఏటా ఒక లక్షా ఇరవై వేలకోట్ల రూపాయల మేరకు బాలల శ్రమను దోచుకుంటున్నారు. ఈ ఆదాయాన్ని ఎటువంటి లెక్కలలోను చూపించరు కనుక అక్రమ ఆర్జన (నల్లధనం)గా యాజమాన్యాల బొక్కసాలలోనికి చేరుతున్నది.

ఈ రోజు వరకు ప్రభుత్వం గాని, యాజమాన్యాలు గాని, పారిశ్రామిక వర్గాలు కాని ఆ నివేదికను ఖండించ లేదు. సామ్రాజ్యవాద నయాఉదారవాద విధానాలైన, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలుపరుస్తున్న భారత దళారీ బూర్జువా పాలకుల చేతులలో భారతదేశ ఆర్థికాభివృద్ధి వెనుకనున్న కథ ఇది!

ఈ మోసాన్ని, అబద్ధాలను, అనైతికతను, ద్వంద్వత్వాన్ని అర్థం చేసుకోవటం ద్వారానే పెట్టుబడి యొక్క స్వభావాన్ని భారత కార్మిక వర్గం అర్థం చేసుకోగలదు. అర్ధవలస–అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూలద్రోసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సామ్యవాద సమాజంగా దేశాన్ని మార్చటంలో తన అగ్రగామి పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించగలదు. ✤

# ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికై విద్యార్థుల ఆందోళన

**గుంటూరు జిల్లా, 13-7-11:**

ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా వున్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ తక్షణమే పాఠ్యపుస్తకాలను, యూనీఫారాలను అందివ్వాలనే డిమాండ్స్‌తో పిడియస్‌ఓ గుంటూరు జిల్లా కార్యవర్గం పిలుపు మేరకు జిల్లాలో పలుప్రాంతాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు.

**మంగళగిరిలో** విద్యార్థులు స్థానిక మార్కెట్ సెంటర్ నుండి మెయిన్ బజారు మీదుగా తాశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన జరిపి, అనంతరం ధర్నా నిర్వహించారు.

**తాడేపల్లిలో** 14-7-11న కెసిపి వర్క్స్ యూపి స్కూల్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని స్థానిక మండల కార్యాలయానికి విద్యార్థులు చేరుకుని తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో పిడియస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు కా॥ ఎస్‌కె. బాజీ సైదా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఆందోళన ద్వారానే పరిష్కరించుకోగలుగుతామన్నారు. పిడియస్‌ఓ నాయకులు చంద్రశేఖర్, రాఘవేంద్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పిడుగురాళ్ళ** మండల కేంద్రంలో 14-7-11న విద్యార్థులు పిడియస్‌ఓ ఆధ్వర్యంలో ప్రదర్శన, అనంతరం తహశీల్‌దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. పిడియస్‌ఓ జిల్లా కార్యదర్శి కా॥ కె. శ్రీను ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కునారిల్లచేస్తున్న పాలకుల విధానాలపై ఉద్యమించాలన్నారు. పిడియస్‌ఓ స్థానిక నాయకులు పి. సరళ, రాంబాబు, తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**రెంటచింతల** మండల కేంద్రంలో విద్యార్థులు 16-7-11న పిడియస్‌ఓ ఆధ్వర్యంలో ప్రదర్శన–తహశీల్‌దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పిడియస్‌ఓ జిల్లా కార్యదర్శి కె. శ్రీను, ఇంకా స్థానిక నాయకులు నరేష్, పి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రమైన **గుంటూరులో** 5-7-11న విద్యార్థులు స్థానిక బి. ఆర్ స్టేడియం నుండి కలెక్టరు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, జిల్లా అధికారులకు మెమోరాండం ఇచ్చారు. పిడియస్‌ఓ జిల్లా నాయకులు కె.వి. రమణారెడ్డి; స్థానిక నాయకులు జనార్దన్, నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ✤

# ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో సమస్యల పరిష్కారానికై ఆందోళన

**గుంటూరు జిల్లా, 23-7-11:**

ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, కళాశాలల్లో వసతి సౌకర్యాలను మెరుగుపరచాలని, బోధనా సౌకర్యాలను పెంపొందించాలని, విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా పిడియస్‌ఓ కార్యవర్గం పిలుపు మేరకు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు.

**మంగళగిరి** పట్టణంలో వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు మార్కెట్ సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి, ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్‌దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడియస్‌ఓ జిల్లా నాయకులు యస్.కె. బాజిసైదా, స్థానిక నాయకులు నజీర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

**పిడుగురాళ్ళలో** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే స్థానిక డిమాండ్స్‌ను జోడించి పిడియస్‌ఓ ఆధ్వర్యంలో ధర్నానిర్వహించారు. పిడియస్‌ఓ జిల్లా కార్యదర్శి కా॥ కె. శ్రీను, నాయకులు పి. సరళ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ✤

# సంక్షేమ హాస్టళ్ళ మూసివేతకుద్దేశించిన ప్రభుత్వ జీ.వోకు వ్యతిరేకత

**గుంటూరు జిల్లా, 24-7-11:**

సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో సౌకర్యాల మెరుగుదల కొరకు విద్యార్థులు ఒకవైపు ఆందోళన సాగిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాపితంగా 500 హాస్టళ్ళను మూసివేసేందుకు జీవోనెం 43ను విడుదల చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ సాంఘిక సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో నిరసనాందోళనలు చేపట్టారు.

**పిడుగురాళ్ళ** ఐలాండ్ సెంటర్‌లో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించి, జీవో 43 ప్రతులను దగ్ధంచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్‌ఓ జిల్లా కార్యదర్శి కా॥ కె. శ్రీను, స్థానిక నాయకులు విజయకుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

**రేపల్లెలో** పిడియస్‌ఓ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్ విద్యార్థులు స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట మానవహారంగా ఏర్పడి జీవో 43 రద్దు చేయాలని నినదించారు. ఈ కార్యక్రమంలో పిడియస్‌ఓ జిల్లా సహాయ కార్యదర్శి కా॥ బి. నాగబసవయ్య; స్థానిక నాయకులు జి.నాగరాజు, ఎల్. శేషు తదితరులు పాల్గొన్నారు.

**మంగళగిరిలో** సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు పిడియస్‌ఓ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో స్థానిక కొప్పురావూరు కాలనీ నుండి ప్రదర్శనగా మిద్దె సెంటర్ చేరుకొని దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ తీవ్ర నిరసనను, ఆగ్రహాన్నీ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్‌ఓ జిల్లా ఉపాధ్యాక్షుడు కా॥ బాజీ సైదాతో సహా స్థానిక నాయకులు చందు, సురేష్, తదితరులు పాల్గొన్నారు. హాస్టల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ✤

# గ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరల పెంపుకు నిరసన

అనంతపురంలో మహిళల ఆందోళన



**అనంతపురం, 25-7-11 :**

యుపిఏ ప్రభుత్వం ఇప్పటి వరకు 21 సార్లు, పెట్రోఉత్పత్తుల ధరలను పెంచుతూ మధ్యతరగతి, దిగువ శ్రేణి ప్రజా జీవితాల్ని, వారి కుటుంబాలను రోడ్ల పాలు చేస్తున్నది. దీని పర్యవసానంగా నిత్యావసర వస్తువుల ధరలు, రవాణా ఛార్జీలు పెరిగి మరింత భారంగా ప్రజలు జీవితాల్ని వెళ్ళబుచ్చాల్సిన పరిస్థితులు దాపురించాయి. బహుళజాతి కంపెనీల, బడా వ్యాపారస్తుల కొమ్ముకాసే పాలకులకు, సామ్రాజ్యవాదులకు ముఖ్యంగా అమెరికా కనుసన్నలలో మెలిగే దళారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారానే బుద్ధి చెప్పగలమని, వీటిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో స్థానికంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు

ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సి. పెద్దన్న, ఎ. నాగభూషణం, సుధాకర్, అజయ్, ఎస్. నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద కట్టెల పొయ్యిలు వెలిగించి తమ నిరసనను తెలియజేశారు. గ్యాస్ ద్వారా వంట చేసుకునే పరిస్థితి పేద, మధ్యతరగతి వర్గానికి లేకుండా చేస్తున్న ప్రభుత్వ విధానాలపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సి. రమాదేవి, కె. శ్రీలక్ష్మి, సి. మల్లేశ్వరి, బి. మల్లేశ్వరి, నాగలక్ష్మి, శ్రీదేవి, సరిత, ఎన్. లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్.జి.ఒ. హోమ్ నుండి ఊరేగింపుగా వెళ్ళి టవర్ క్లాక్ వద్ద పొయ్యిలు వెలిగించి తమనిరసనను చేపట్టారు. ✤

# సంక్షేమ హాస్టళ్ళ పరిరక్షణ, కనీస వసతులకల్పనకై ఆందోళన

**గుంటూరు జిల్లా, 19-7-11 :**

పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వైద్యసౌకర్యాలు కల్పించాలని, వసతులు మెరుగుపర్చాలని, హాస్టల్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకై పిడియస్‌ఓ జిల్లాకార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు వివిధ ప్రాంతాలలో కార్యక్రమాలు జరిగాయి.

**మంగళగిరిలో** సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు కొప్పురావూరు కాలనీ నుండి ప్రదర్శనగా తహశీల్‌దారు కార్యాలయంచేరి ధర్నా నిర్వహించారు. పిడిఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు కా॥ బాజీ సైదా మాట్లాడుతూ మంగళగిరి ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్ళను స్పెషల్ హాస్టళ్ళుగా చేయాలనీ, ఎస్సీ హాస్టల్ పాత భవనాలను కూల్చి వేయాలని, నూతక్కి హాస్టల్‌కు స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిడియస్‌ఓ నాయకులు సురేష్, లోకేష్, సింధు, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

**కారంపూడిలో** సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులు పిడియస్‌ఓ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేపట్టారు. పిడియస్‌ఓ జిల్లా కార్యదర్శి కె. శ్రీను మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమ నిధులలో కోత విధిస్తూ, మరోవైపున నిత్యావసర వస్తువుల ధరలను పెంచివేస్తున్న పాలకుల విధానాలను ఎండ గట్టారు. ఈ కార్యక్రమంలో ఇంకా అనిల్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. ✤

మంగళగిరిలో సాంఘిక సంక్షేమ విద్యార్థుల ప్రదర్శన





పిడుగురాళ్ళలో సాంఘిక సంక్షేమ విద్యార్థుల రాస్తారోకో

# కుంకాల అమరుల స్మారకసభ



అమరుల సభలో ప్రసంగిస్తున్న కా॥ కుండ్ల గంగరాజు; సభకు హాజరైన ప్రజానీకం

**కుంకాల, 24-6-11:**

పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలంలోని కుంకాల, పెంద్రాల, జిలేళ్లగూడెం, మనుగోపాల ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న ఆందోళనల కొనసాగింపుగా కుంకాల గ్రామంలో గిరిజన సంఘ నిర్మాణానికి, భూపోరాటం నిలదొక్కుకునేందుకు తీవ్రంగా కృషిచేసి మరణించిన పెద్దలు కామ్రేడ్స్ కొక్కెర చంద్రయ్య, కరకం రామయ్య, తోకల లక్ష్మణయ్య, కలుం పోతురాజు, కలుం పెదభీమరాజు, కోటం వీరాస్వామి తదితరుల స్మారక సభ జరిగింది.

గిరిజన పెద్దలైన కామ్రేడ్స్ **కొక్కెర చంద్రయ్య, కరకం రామయ్య**లు 16 సంవత్సరాల క్రితం 25-30 కి॥మీ దూరంలోని కొండమొదలు నడిచివెళ్ళి గిరిజన సంఘం తమ ప్రాంతానికి రావాలని ఆహ్వానించారు. నాటి నుంచి వారు జీవించినంతకాలం సంఘాన్ని ఏర్పాటుచేసుకొని, దానిని కాపాడుకొంటూ వచ్చారు. యువతరం నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు, దానికోసం కృషిచేశారు. పెంద్రాల గ్రామంలో **తోకల లక్ష్మణయ్య** సంఘం ప్రారంభం నుండీ ముఖ్యపాత్ర వహించటమేకాక సంఘ నాయకుడిగా చివరిదాకా నిలిచాడు. పెత్తందారుల ఒత్తిడిని ఎదిరించి ప్రజలను నిలబెట్టాడు. **కలుం పోతురాజు (కాశయ్య)** కొత్త కుంకాల గ్రామంలో సంఘ నిర్మాణంలో ముఖ్యపాత్ర వహించటమేకాక పెత్తందారులకు వ్యతిరేకంగా ప్రజలను నిలబెట్టటంలోను గిరిజన పెత్తందారుల దోపిడీని ఎదిరించడంలో ముందు నిలిచారు. **కలుం పెద్ద భీమరాజు, కోటం వీరాస్వామి** 1948 నాటి జమీందారి వ్యతిరేక పోరాటంలో ముఖ్యపాత్ర వహించారు. నాటి జమిందారు ఏనుగుపై ఎక్కి గిరిజనులపై దాడికి ప్రయత్నించినప్పుడు వింటి బద్దలతో జమీందారును, ఆయన బంట్లను ఎదుర్కొని నిలిచారు. జైలు శిక్షలు అనుభవించారు. వారు చనిపోతూ వారి బిడ్డలకి జమీందారీ వ్యతిరేక పోరాట చైతన్యాన్ని వారసత్వంగా అప్పగించి వెళ్ళారు.

అమరులందరూ గిరిజనుల ఐక్యతను కోరుకున్నారు. గిరిజనులుగా పుట్టి, భూస్వాములకు అనుచరులుగా మారిన నీచత్వాన్ని ద్వేషించారు. కష్టకాలంలోకూడా భూపోరాట ఆవశ్యకతను, ఆదివాసీ ప్రజలపట్ల నిబద్ధతను కోల్పోలేదు. వీరందర్నీ స్మరించుకునేందుకు, నేటి యువతరం, విద్యార్థులలో పాలకులు పెంచి పోషిస్తున్న సంకుచిత, స్వార్థపూరిత విధానాలను విడనాడి గిరిజన పెద్దల ఐక్యతబాటలో నడవాలని పిలుపునిస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం అమరుల సంస్మరణ సభను నిర్వహించింది.

24-06-2011న కుంకాలలో అమరుల చిత్రపటాలకి ఏజెన్సీ గిరిజన సంఘం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కామ్రేడ్స్ కుండ్ల గంగరాజు, ఉపాధ్యక్షులు కా॥మడి పండయ్య, కుంకాల ప్రాంత నాయకులు కామ్రేడ్స్ కలుం ధర్మరాజు, సురక్క, కరకం కన్నయ్య, బాయ్యమ్మ, కలుం దులయ్య, కలుం సింగరాజు తదితరులు పూలతో నివాళులర్పించారు.

కామ్రేడ్ కలుం గంగాదేవి అధ్యక్షత వహించిన ఈ సంస్మరణ సభలో కా॥కుండ్ల గంగరాజు, మడి పండయ్య, కుంజం రామారావు, సవలం రాంబాబు, కలుం ధర్మరాజు, పద్దం కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. ఉపన్యాసకులు గిరిజన పెద్దల జీవితాన్ని, కృషిని వివరించారు. వారి ఆశయాల సాధనకు పూనుకోవాలని, సంఘం లేకుండా ఈ పోరాటం లేదని, సంఘాన్ని పట్టిష్టపరుచుకోవలసిన ఆవశ్యకతను వివరించారు.

అనంతరం సుమారు నాలుగువందలమంది ప్రజలు కుంకాల, కొత్త కుంకాల గ్రామాల మీదుగా అమరులకు జోహార్లు చెపుతూ ప్రదర్శన నిర్వహించారు. ✤

# ఆర్టీసీ ఛార్జీల పెంపుదలకు నిరసన




పిడుగురాళ్ళలో నిరసన ప్రదర్శన



బందరులో ధర్నా

**పిడుగురాళ్ళ, 16-7-11 :**

ఆర్టీసీ ఛార్జీల పెంపును నిరసిస్తు సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో జానపాడురోడ్‌లోని ఎపిఎఫ్‌టియు కార్యాలయం నుండి ఐలాండ్ సెంటర్, పోలీస్ స్టేషన్, అంజిరెడ్డి హాస్పిటల్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. పెంచిన బస్సు ఛార్జీలు తగ్గించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీకి ప్రకటించిన అన్నిరకాల రాయితీలు చెల్లించాలని ఈ ధర్నాలో నినదించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి రైతుకూలీసంఘం నాయకులు కా॥ ఎన్. రాంబాబు మాట్లాడుతూ గత నెలలోనే పెట్రోల్, డీజిల్, గ్యాస్, కిరోసిన్, ధరలు పెరగడం వలన అన్నిరకాల నిత్యావసర వస్తువులు అమాంతం ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో మళ్ళీ ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచడం పేద ప్రజలపై మోయలేని భారంగా మారుతున్నదన్నారు.

స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ ఎం. నిర్మల, చైతన్య సున్నం మిల్లుల యూనియన్ నాయకులు ఇ. పొలేసు, ఎం. సత్యనారాయణ, రమాదేవి, పద్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**బందరు, 16-7-11 :**

డీజిల్ ధరలు పెరిగినప్పుడల్లా ఆర్టీసీ ఛార్జీలు భారీగా పెంచి ప్రయాణీకులపై భారాలు మోపడాన్ని ఖండిస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.), ఎపిఎఫ్‌టియు బందరు ఏరియా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్ మాట్లాడుతూ ఆర్టీసీ ఛార్జీలు పెంచకుండా అమ్మకం పన్ను, ఎక్సైజ్‌పన్ను, సమర్ధవంతమైన నిర్వహణ, డీజిల్ పొదుపు ద్వారా రూ. 1000 కోట్లు ఆదా చేయెచ్చుననీ, విమానాలకు వసూలు చేసినట్టుగా ఆర్‌టీసీకి కూడా 22.8 శాతంకు బదులు 4 శాతమే అమ్మకంపన్ను వసూలు చేస్తే 400 కోట్లపైన ఆదా అవుతుందనీ, ఇదంతా ఏమీ చేయకుండా పెద్దఎత్తున భారాన్ని ప్రజలపై మోపడం అన్యాయమనీ అన్నారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకురాలు కా॥ పామర్తి అంజమ్మ, ఏఫిఎఫ్‌టియు బందరు ఏరియా కార్యదర్శి బెల్లంకొండ రవి, నవయువ సమాఖ్య బందరు ఏరియా కార్యదర్శి జి. మల్లేష్, స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు బి. నాగమణి ప్రసంగించారు. ధర్నాలో రైతులు, కూలీలు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు. కళాకారులు ప్రజాసమస్యలపై పాటలు పాడారు. ✤

# కౌలుదారుల గుర్తింపు కార్డులకై ఆందోళన

**రెంటచింతల, 2-7-11 :**

దేవాదాయ, మాన్యం భూముల కౌలు సాగుదార్లకు గుర్తింపు కార్డులను, పంటల నష్టపరిహారాన్ని యివ్వాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రదర్శన, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక రైతుకూలీసంఘం ఆఫీసు నుండి బయలుదేరిన ప్రదర్శన ఎరువులకొట్ల బజారు, బ్రహ్మయ్య బావి, జెండా చెట్టు, రెంటాలరోడ్డు గుండా సాగి తహశీల్దార్ ఆఫీస్ వద్దకు చేరుకుంది.

ఈ ధర్నాలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 15 సం॥లుగా దేవాదాయ, ధర్మాదాయ మాన్యం భూములను కౌలుకు సాగుచేసుకుంటూ ప్రతి సం॥ క్రమం తప్పకుండా అనుకున్న మేరకు కౌలు చెల్లిస్తున్నారని, మాన్యం భూముల సాగుదార్లందరూ నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజలేనని, అయితే రెవిన్యూ, దేవాదాయ అధికారులు వారిని కౌలుదార్లుగా గుర్తించ నిరాకరించి ప్రభుత్వం అందిస్తామనే అరకొరా సహాయాన్ని కూడా దేవాదాయ, మాన్యం భూముల సాగుదార్లకు అందకుండా చేయడం పేద కౌలుదార్లకు వ్యతిరేకమైనచర్య అనీ, భూ యజమాని ఒప్పందంతో సంబంధం లేకుండా కౌలుదార్లకు కౌలు గుర్తింపు కార్డులను యివ్వాలనీ, పంట నష్టపరిహారాన్ని కౌలుదార్లకే నేరుగా అందివ్వాలనీ డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కౌలు రైతులు అచ్చిరెడ్డి, భోజ్యానాయక్, పాలకుర్తి సత్తయ్య, బుట్టి మరియదాసు, పెద్దిరెడ్డి, వాసు, స్వాములు తదితరులు పాల్గొన్నారు. ✤

# విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కా॥ పాతర్ల నాగయ్య వర్ధంతి సభ



కా॥ పాతర్ల నాగయ్య స్థూపం వద్ద నివాళులు

**డోలాస్ నగర్, 23-7-11 :**

కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు విప్లవకారుడు, అమరుడు కా॥ పాతర్ల నాగయ్య 33వ వర్ధంతి కార్యక్రమం గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, డోలాస్‌నగర్ సెంటర్‌లో కా॥ నాగయ్య స్థూపం వద్ద జరిగింది. తొలుత ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి, కా॥ నాగయ్య స్థూపానికి పూలమాలవేసి జోహార్లర్పించారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ కార్మికవర్గాన్ని వారి హక్కుల సాధనకు సంఘటిత పర్చడం కోసం, కార్మిక వర్గ విప్లవ నాయకత్వాన్ని నిలబెట్టటం కోసం కా॥ పాతర్ల నాగయ్య తన జీవితాన్ని అంకితం చేశారనీ, కా॥ నాగయ్య- మేధావి-ఆర్గనైజర్-ఉపన్యాసకుడు- నాయకుడనీ, ఇన్ని గుణాలన్నింటినీ కలబోసుకొన్న గొప్ప విప్లవకారుడనీ, కా॥ నాగయ్యను స్మరించుకోవడం అంటే పోరాటాల్ని స్మరించుకోవడమేననీ అన్నారు. కా॥ నాగయ్య అతివాద, మితవాదాలకు ఎదురు నిలిచి, ప్రజాయుద్ధ పంథాను నిలపడానికి కృషిచేసిన నాయకుడని అన్నారు. ఈనాడు కార్మికవర్గం ఎన్నో కుట్రలకు, దోపిడీకి బలైపోతూ సాధించుకొన్న హక్కులు ఒక్కొక్కటే కోల్పోతూ వున్న పరిస్థితుల్లో తిరిగి కార్మిక వర్గాన్ని సంఘటితం చేసే నాయకత్వం తయారు కావాలనీ, హక్కులను నిలబెట్టుకుంటూ కార్మికవర్గ రాజ్యాధికారం కోసం కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకతాటిపైకి రావటమే కా॥ నాగయ్యకు మనం అర్పించే నిజమైన నివాళి అని కా॥ స్వామి అన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి, సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ రాచకొండ సాంబశివరావు, ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ కొర్రపాటి ఆదినారాయణ తదితరులు ఉపన్యసించారు. ✤




మహోజ్వల తెలంగాణ రైతాంగ సాయుధపోరాట
నవల సాహిత్యం- పరిచయాలు-పరిశీలన



సామ్రాజ్యవాద కంపెనీల అనైతిక ఔషధ ప్రయోగాలు
వెల: 12/-

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2


# పేదల స్మశానానికి స్థలం కేటాయించాలని ఆందోళన

**తాళ్ళూరు, 20-6-11 :**

ప్రకాశం జిల్లా, తాళ్ళూరు మండలం, గంగవరం పంచాయితీ-సోమవరప్పాడు గ్రామ శివారులో ఎన్ఎస్‌పి కాలనీ వద్ద గత 15-20 సంవత్సరముల నుండి పాముల, బండ, దక్కలి, యానాది, ఎరుకల, బొందలి, ముతరాశి, దూదేకుల, రజక, చెంచు, కోయ, జంగాల మొదలగు కులాలకు చెందిన దాదాపు 100 కుటుంబాలకు పైగా స్థిర నివాసము ఏర్పాటు చేసుకొని వివిధ రకాల చేతివృత్తుల, కులవృత్తులతో సవరములు కట్టి గ్రామాలలో అమ్ముకుంటూ, పందులను మేపుకుంటూ, వ్యవసాయ మరియు ఇతర కూలీ పనులతో జీవనము సాగిస్తున్నారు. యిక్కడ నివశిస్తున్న వారందరూ నిరుపేద బడుగుజీవులు. వీరందరికీ ఓటరు గుర్తింపు కార్డులు, ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులు వున్నాయి. వీరిలో ఎవరు చనిపోయినా గతంలో సోమవరప్పాడు స్మశాన వాటికలో దహన, ఖనన సంస్కారములు జరుగుతుండేవి. ఈ మధ్య కాలంలో ఈ కుటుంబాలలో చనిపోయినవారి శవాలను సోమవరప్పాడు స్మశానవాటికలోనికి రానీయకుండా గ్రామ పెత్తందారీ శక్తులు అడ్డుకుంటున్నారు. కొన్ని సార్లు రోడ్ పైననే దహన సంస్కారాలు నిర్వహించుకోవలసి వస్తున్నది.

ఈ సమస్యపై గ్రామ, మండల రెవిన్యూ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా, సమస్య పరిష్కారం కాకపోవటంతో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో తాళ్ళూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరంలో రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఎస్. లలితకుమారి మాట్లాడుతూ వేలాది ఎకరాల పంట భూములను సెజ్‌లు, రియల్ ఎస్టేట్‌ల పేరుతో మన పాలకులు బీళ్ళుగా మారుస్తున్నారని, రియల్ ఎస్టేట్ బూమ్‌తో భూముల ధరలు పెరగటంతో గ్రామాలలోని పెత్తందారీ శక్తులు స్మశానాలను కూడా కబ్జా చేస్తున్నారని, చనిపోయిన శవాలను దహనం లేదా ఖననం చేయడానికి భూమి కేటాయించేవరకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం స్మశానవాటికకు స్థలం కేటాయించ వలసినదిగా మండల తహశీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. స్మశాన వాటికకు స్థలాన్ని పరిశీలించ వలసినదిగా గ్రామ అధికారులను ఆయన ఆదేశించారు.

ఈ కార్యక్రమములో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ పరిటాల కోటేశ్వరరావు; చెన్నయ్య, సుబ్బారావు, నాయుడు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు. ✤

# ప్రజా యుద్ధపంథాలో రాజీలేని పోరాటం చేసిన విప్లవ యోధుడు కా॥ టి.యన్.

## కా॥ టి.యన్. వర్ధంతి సభలో వక్తల ఉద్ఘాటన


వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ జస్వంతరావు; సభకు హాజరైన ప్రజలు

**విజయవాడ, 28-7-11 :**

విప్లవోద్యమ రథసారధి తరిమెల నాగిరెడ్డి 35వ వర్ధంతి సభ స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగింది. ఈ సభకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటీ సభ్యులు కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ అధ్యక్షత వహించారు. సభలో తొలుత కా॥ నాగిరెడ్డి చిత్రపటానికి ఉపన్యాసకులు పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు నాగిరెడ్డి భారత ప్రజలకు దొరికిన అపరూపమైన వజ్రకరూర్ వైడూర్యంగా భార్గవశ్రీ పేర్కొన్నారు.

ఈ సభలో సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర కమిటీ నాయకులు కా॥ పోలవరపు జస్వంతరావు మాట్లాడుతూ, కా॥ నాగిరెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా స్వయంగా తన తండ్రి సుబ్బారెడ్డి మీద భూస్వాధీనం కోసం పోరాటం సాగించిన పోరాట యోధుడని కీర్తించారు. నక్సల్‌బరీ విప్లవం తర్వాత విప్లవోద్యమంలో తలెత్తిన అతివాద, దుందుడుకు వాద, పెడ ధోరణులకు వ్యతిరేకంగా విప్లవ పంథాలో ప్రజా ఉద్యమ నిర్మాణం సాగించటం కోసం రాజీలేని పోరాటం సాగించాడనీ, విప్లవకారుల మధ్య చీలికలు నష్ట దాయకమనీ, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా పీడిత ప్రజానీకం సంక్షోభంలోకి లాగబడుతున్న స్థితిలో సరైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం అవసరం అనీ, నాగిరెడ్డి చూపిన బాటలో విప్లవకారుల ఐక్యతకు ముందుకు సాగటం నేడు విప్లవకారుల ముందు ఉన్న ముఖ్య కర్తవ్యమని చెప్పారు.

బొగ్గు, ఇనుము, బాక్సైట్ లాంటి సహజవనరులతో పాటు అపారంగా ఉన్న ఆయిల్, గ్యాస్ సంపదలను బహుళజాతి కంపెనీలకు మన పాలకులు ప్రపంచీకరణ విధానాల పేరుతో దోచిపెడ్తున్నారని, ఆయిల్, గ్యాస్ రంగలో ప్రతిభావంతంగా పనిచేస్తున్న ఓఎన్‌జీసీ ప్రభుత్వ సంస్థను ప్రక్కనపెట్టి అదిసాధించిన ఫలితాలను రిలయన్స్ లాంటి కంపెనీలు సొమ్ముచేసుకొంటున్నాయనీ, అలానే మన దేశీయ పరిశ్రమలైన పేపర్, సిమెంట్‌లాంటి కంపెనీలను విదేశీ బడా కంపెనీలు కారు చౌకగా కొనేసి, ఇష్టం వచ్చిన రేట్లకు తమ ఉత్పత్తులను అమ్ము కొంటూ ప్రజలపై భారాలు మోపుతున్నాయనీ, కావున విదేశీ పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

మాజీ వ్యవసాయశాఖామంత్రి వడ్డేశోభనాద్రీశ్వర రావు ప్రసంగిస్తూ, తరిమెల నాగిరెడ్డి మూడుసార్లు శాసన సభ్యులుగా, ఒకసారి పార్లమెంటు సభ్యునిగానేగాక పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా అపార మేధా సంపన్నుడిగా, గొప్ప దార్శనికుడిగా, పేర్గాంచి భారతదేశ ఆర్థిక వ్యవస్థ తాకట్టుపెట్టుబడిందని, తనతోపాటు తోటి విప్లవకారులపై పెట్టబడిన, 'స్వతంత్ర' భారతదేశంలో మొట్టమొదటదీ అయిన 'హైదరాబాద్ కుట్రకేసు' విచారణ సందర్భంగా 1971లో తాను స్వయంగా కోర్టులో చదివిన స్టేట్‌మెంట్ లోనే భారతదేశం విదేశాలకు తాకట్టు పెట్టబడిందని ఆర్థిక గణాంక వివరాలను పేర్కొని స్పష్టంగా ప్రకటించారని, ఆ కోర్టు స్టేట్‌మెంట్‌నే 'తాకట్టులో భారతదేశం' (ఇండియా మార్టిగేజ్‌డ్) పేరుతో ప్రచురించారని చెప్పారు. విదేశీ పెట్టుబడుల విషయంలో నాగిరెడ్డి ఆనాడు చెప్పిన విషయాలు ఈనాడు మరింతగా తేటతెల్లం కావడమే గాక, విదేశీ పెట్టుబడుల ప్రవాహం అన్ని రంగాలను ఆఖరికి రిటైల్ వ్యాపార రంగంలోకి కూడా చేరి ముంచెత్తి మన దేశీయ రంగాలను కబళించి వేస్తున్నదని చెప్పారు. ఇంతటి తీవ్ర పరిణామాలు రావటానికి పివి నరసింహా రావు ప్రధానమంత్రిగా వున్న కాలంలో తేబడిన డంకెల్ ప్రతిపాదనలపై భారతదేశం సంతకం పెట్టడం, ఆ క్రమంలో గాట్ ఏర్పడటం, గాట్-ప్రపంచవాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ) గా రూపాంతరం చెంది. అందులో భారతదేశం సభ్యదేశంగా చేరిపోవటంతో 1990 తర్వాత ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు వాయువేగంతో విస్తరించి మనదేశాన్ని అక్షరాల తాకట్టు పెట్టాయి అనటం కంటే సంతలో బేరానికి పెట్టాయని అనవచ్చని అన్నారు. ప్రపంచీకరణ విధానాలలో భాగంగా మనదేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను అమెరికా సామ్రాజ్యవాదుల గుప్పెట్లో వున్న ప్రపంచ బ్యాంక్ నిర్దేశించే స్థితికి వచ్చిందని, దాని ప్రకారం మన ప్రధాన మంత్రి ప్రపంచబ్యాంక్ సిఇఒగా పనిచేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు ఏ విధంగా రూపొందించాలో, ఎవర్ని మంత్రులుగా, అధికారులుగా నియమించాలో ప్రపంచ బ్యాంక్ నిర్ణయించే దుస్థితిలో మన దేశవిధానాలు దిగజార్చబడ్డాయనీ, నూతన ఆర్థిక, సరళీకరణ విధానాలలో భాగంగా మనదేశంలోని ఇతర రంగాలతో పాటు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నారని, వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించే విధంగా ఉన్న సబ్సిడీల విధానాన్ని ప్రపంచబ్యాంక్ ఆదేశాలతో క్రమక్రమంగా ఎత్తివేస్తూ వ్యవసాయం దండుగ అనిపించే విధంగా రైతాంగం క్రాప్ హాలిడేను ప్రకటించే స్థితిని తీసుకొచ్చి అంతిమంగా కార్పోరేట్, కాంట్రాక్టు వ్యవసాయాన్ని రుద్దుబోతున్నారన్నారు. కావున నాగిరెడ్డి ముందుగానే ఊహించి హెచ్చరించినట్లుగా ఇతర రంగాలతోపాటు మనదేశీయ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అలానే మన పాలకుల దిగుమతి పాలసీలు బడా విదేశీ కంపెనీల ఉత్పత్తులను జీరో టాక్స్ పద్ధతిలో మనదేశానికి దిగుమతులు చేసుకొంటున్న ఫలితంగా మన మార్కెట్‌ని విదేశీ ఉత్పత్తులతో నింపివేసి అవి పెద్ద ఎత్తున లాభాలు గడిస్తున్నాయని, రిలయన్స్ లాంటి బడా కంపెనీ రు. 20 వేలకోట్లు ఖర్చుపెట్టి రు. 35 వేల కోట్లు ఖర్చుపెట్టి నట్లు లెక్కలు చూపించి, పార్లమెంట్‌లో ఆమోదించేసు కున్నదంటే, ఇంత అడ్డగోలుగా ప్రజల సొమ్ముతింటుంటే ఈనాడు నాగిరెడ్డి లాంటివాళ్ళు వుంటే ప్రభుత్వం బొడ్లో చెయ్యేసి నిలబెట్టేవారని, అలాంటి వారు నేడు కరువయ్యారని ఉద్వేగంగా మాట్లాడారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ వై. సోనీ మాట్లాడుతూ నాగిరెడ్డి రూపొందించిన ప్రజాపంథా వెలుగులో గిరిజన ప్రాంతాలైన ఉభయ గోదావరి జిల్లాలు, విజయనగరం జిల్లాల్లోనూ, ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు కోరాపుట్ ప్రాంత ఆదివాసుల మధ్యనూ దున్నేవానికే భూమి నినాదంగా భూముల కోసం పోరు సాగిస్తున్నారనీ, పోరాటాలు సాగించి భూములు నిలబెట్టుకొంటూ, మావోయిస్టుల హంతక దాడులను ఎదుర్కొంటూ ఉద్యమాలు సాగిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఎంత దగాకోరుగా ఉన్నాయో సోదాహరణంగా వివరించారు. ఇంకా ఈ సభలో పార్టీ విజయవాడ నగర కార్యదర్శి కా॥ టి. పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. ✤

## కొనసాగుతున్న ఔషధ ప్రయోగ బాధితుల ఆందోళన - అరెస్టులు


గుంటూరులో ఔషధ ప్రయోగబాధితుల అరెస్టు

**పిడుగురాళ్ళ, 12-7-11 :**

ఔషధ ప్రయోగాల ఉదంతం వెలుగుచూసిన నేపథ్యంలో బాధితులకు నష్టపరిహారం అందిస్తామని కంటితుడుపు ప్రకటనలు చేసి చేతులు దులుపుకున్న అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధితులు స్త్రీవిముక్తి సంఘటన, రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌ని కలిసి తమ బాధలను, కుటుంబ పరిస్థితులను మరోమారు వివరించారు. తాము పనిచేస్తే గాని పూటగడవని పరిస్థితికి నెట్టబడ్డామని, అందువలన తమకు జీవనం గడవటం కోసం తక్షణ నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

యాక్సిస్ కంపెనీని మూసివేసి చేతులు దులుపుకున్న ప్రభుత్వం కంపెనీ యొక్క యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా వదిలి వేయడం సిగ్గుచేటైన విషయమనీ, కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలనీ, బాధిత మహిళలకు, కుటుంబాలకు 5 లక్షలు నష్టపరిహారం అందజేయాలని, బాధితులకు జీవితాంతం వైద్య సౌకర్యం అందజేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ ఎన్. రాంబాబు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎం. నిర్మల, బాధితులు, కా॥ మల్లేశ్వరి, వడ్డె నాగలక్ష్మి, కె. వెంకాయమ్మ, కోటేశ్వరి, ఎస్.కె. రహంతున్నిస, ఎస్‌కె. సైదాబి తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు, 28-7-11 :**

రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా ఔషధ ప్రయోగ బాధితుల గోడును ఆయనదృష్టికి తీసుకువెళ్ళటానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఒకవైపున అనుమతిస్తూనే, మరోవైపున 27-7-11న ముందు జాగ్రత్త పేరుతో పిడుగురాళ్ళ పోలీసు అధికారులు బాధితులను, వారితోపాటు స్త్రీ విముక్తి సంఘటన నాయకులైన ఎం. నిర్మలను అరెస్టుచేసి, ఆపై స్వంత పూచీకత్తుతో విడుదల చేశారు. తిరిగి 28-7-11న గుంటూరులో ముఖ్యమంత్రిని కలవటానికివెళ్ళిన 10 మంది బాధితులతో సహా సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, జిల్లా నాయకులు రాంబాబు, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎం. నిర్మల, ఏపిఎఫ్‌టియు నాయకులు యు. క్రిష్ణ, ఆటోయూనియన్ నాయకులు ఖాజావలిలను అప్రజాస్వామికముగా నిర్బంధములోకి తీసుకున్నారు. ఔషధ ప్రయోగబాధితులు ముఖ్యమంత్రిని కలిసి తమగోడు వినిపించుకొనే అవకాశం కూడా లేకుండా అడుగడుగునా నిర్బంధించి, ఆటంకాలు కల్పించిన ప్రభుత్వ, పోలీసు చర్యలను బాధితులు తీవ్రంగా నిరసించారు. ✤

# తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు

**6 ఆగస్టు 2011 (శనివారం) ఉదయం 10 గంటలకు**

## కా॥ తరిమెల నాగిరెడ్డి కోర్టు ప్రకటన 'తాకట్టులో భారతదేశం' నేటి ప్రాధాన్యత - అంశంపై సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్

అధ్యక్షులు :

**డా॥ బి. సూర్యనారాయణ రెడ్డి** ఛైర్మన్, టి.ఎన్.ఎం. ట్రస్టు

పుస్తకావిష్కరణ :

**"తాకట్టులో భారతదేశం"** హిందీ అనువాదం **"భారత్ ఏక్ బంధక్ రాష్ట్ర"**










ఆవిష్కర్త :

**కా॥ సుబోధ్ మిత్రా** సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులు

ప్రధానోపన్యాసకులు :

**కా॥ అరవింద్ సిన్హా** సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులు

ఉపన్యాసకులు :

**కా॥ సుబ్రత బసు** సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులు
**ఎ.బి.కె. ప్రసాద్** ప్రముఖ పాత్రికేయులు
**ప్రొ॥ కె.ఆర్. చౌదరి** వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త
**కా॥ ఎం.టి. ఖాన్** విప్లవ రచయిత
**కా॥ నిఖిలేశ్వర్** విప్లవ కవి
**కా॥ జి. విజయకుమార్** సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు
**కా॥ ఎస్. ఝాన్సీ** సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు
**కా॥ కె. కోటయ్య** సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు

ముగింపు :

**కా॥ పి. జస్వంతరావు** కార్యదర్శి, టి.ఎన్.ఎం. ట్రస్టు

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010